# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

23.01.2026 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 196 | పేజీలు : 14 Pages : 14 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789





## భోజ్‌శాలపై సుప్రీం కీలక ఆదేశాలు

4

**ఇరు మతస్థుల పూజలు, ప్రార్థనలకు అనుమతి**

మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల ఆలయం-కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రార్థనల విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాంతంలో శుక్రవారం హిందూ, ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. వసంత పంచమి సందర్భంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ హిందూ మతస్థులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది.




## తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృతభారత్ ఎక్స్‌ప్రెస్

నేడు కేరళలో జెండా ఊపనున్న ప్రధాని మోడీ

4

# ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్



## యూపీసీ వోల్ట్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం

**రూ.5 వేల కోట్ల పెట్టుబడులు ▪ సుమారు 4వేల మందికి ఉపాధి**

**హైదరాబాద్, జనవరి 22:** దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని ఆకర్షించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్

మిగతా 2 లో

## వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ

'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలపై విస్తృత చర్చ



## ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో తెలంగాణ రికార్డు

- 25 ఏళ్లలో ఇదే అత్యధిక స్థాయి ▪ దేశ చరిత్రలో ఆల్‌టైమ్ హై
- 14.20 లక్షల రైతులకు రూ.18,532.98 కోట్ల చెల్లింపు
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, జనవరి 22:** తెలంగాణ రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా, ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో దేశ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసుకుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక స్థాయి అని ఆయన స్పష్టం చేశారు. 2025ఉ26 రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌర సరఫరాల శాఖ రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన రైతు అనుకూల విధానాల ఫలితంగానే ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో చారిత్రక రికార్డు సాధ్యమైందని పేర్కొన్నారు.

మిగతా 2 లో

## సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం

నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ

ఇద్దరు సభ్యుల బృందం ఏర్పాటు..

మూడు రోజుల్లో నివేదిక

2






2

## తెలుగు సినిమాలకు గద్దర్ అవార్డులు

**ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం**

2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది.



2

## గ్రూప్1 తీర్పు వాయిదా

వచ్చే నెల 5న తీర్పు

స్పష్టం చేసిన హైకోర్టు

గ్రూప్-1పై తెలంగా హైకోర్టు తీర్పు వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని డివిజన్ బెంచ్ వెల్లడించింది. తీర్పును వచ్చే నెల 5కు వాయిదా వేసింది.

## కేటీఆర్‌కు సిట్ నోటీసులు



- ఫోన్‌ట్యాపింగ్‌కేసులో జారీ
- నేడు జూబ్లీహిల్స్‌పీఎస్‌లో విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు.

2

## అటెన్షన్ డైవర్షన్ స్కీమ్

కేటీఆర్‌కు నోటీసులపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

3

## 27న బ్యాంకుల సమ్మె

**బ్యాంకుల్లో ఐదురోజుల పని విధానానికి డిమాండ్**

దేశవ్యాప్తంగా ఈనెల 27న సమ్మె నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగ సంఘాలుహెచ్చరించాయి. 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ప్రకటించాయి.

3




## కాలిబాట నుండి హెలికాప్టర్ వరకు మేడారం రాక

హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి సీతక్క

మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం హెలికాప్టర్ సేవలను ప్రారంభించారు.

3



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ శుక్రవారం 23 జనవరి 2026



# కేటీఆర్‌కు సిట్ నోటీసులు

## నేడు జూబ్లీహిల్స్‌పీఎస్‌లో విచారణ

**హైదరాబాద్,జనవరి 22:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం నాడు ఉదయం 11:00 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలంటూ కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. సీఆర్‌పీసీ 160 కింద నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులను సిట్ అధికారులు అందజేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీస్ ఉన్నతాధికారుల్లో కొందరు ఇప్పటికే అరెస్ట్ అవగా.. ఇప్పుడు నాయకుల విచారణ జరుగుతోంది. ఈ కేసులో ఇటీవలే మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు.. ఆయన్ను కూడా ఇటీవల విచారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను పలు అంశాలపై విచారించిన అధికారులు.. కీలక సమాచారం రాబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. 'నిన్న నాకు నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌కు ఇచ్చారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పే దమ్ములేదు. రేవంత్ రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా వదలబోము. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా.. రేవంత్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన వెంటపడుతూనే ఉంటాం' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# గ్రూప్-1పై తీర్పు వాయిదా

**హైదరాబాద్,జనవరి 22:** గ్రూప్–1 పై గురువారం తెలంగా హైకోర్టు తీర్పు వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని హైకోర్టు డివిజన్ బెంచ్ వెల్లడించింది. గ్రూప్–1 పై వెలువరించాల్సిన తీర్పును వచ్చేనెల 5కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుతో 563 మంది గ్రూప్–1 అధికారుల భవితవ్యం తేలనున్నది. టీజీపీఎస్సీ 2024 లో గ్రూప్ 1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్షలో అవకతవకలు జరిగాయని హైకోర్టును ఆశ్రయించారు సెలెక్ట్ కాని అభ్యర్థులు. విచారణ అనంతరం సెలెక్షన్ లిస్టును రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది హైకోర్టు డివిజన్ బెంచ్. గత నెల 30 న పూర్తి వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్.. ఇవాళ నిర్ణయం వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది.

# సినిమాలకు గద్దర్ అవార్డులు

## ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 22:** 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్–2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవార్డుల వివరాలు వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

# స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా భారత్

## సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో గవర్నర్



**హైదరాబాద్,జనవరి 22:** ప్రధాని నరేంద్ర మోదీ.. దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మార్చాలని విజన్‌గా పెట్టుకున్నారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఆడారు గవర్నర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు కేవలం మెడల్స్ కోసమే కాదని.. దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపేందుకు స్పోర్ట్స్ ఒక శక్తిమంతమైన మార్గమని గవర్నర్ వివరించారు. స్వచ్ఛ భారత్ ఒక ఉద్యమంగా మారిందని, యోగాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధాని మోదీ పాలసీలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో ఆయన నాయకత్వ సామర్థ్యం అద్భుతమైనదని కొనియాడారు జిష్ణుదేవ్ వర్మ. ఈశాన్య రాష్ట్రాల నుంచి అన్ని మెడల్స్ వస్తాయని ఊహించలేదని, త్రిపుర నుంచి ఒలింపిక్స్‌కు పోటీ పడుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ మంత్రి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఇంత స్థాయిలో పాల్గొనడం సంతోషకరమని గవర్నర్ అభివర్ణించారు. క్రీడలు ప్రజలకు ఎన్నో నేర్పుతాయన్నారు. ఇది వికసిత్ భారత్ కోసం వేసే ముందడుగు అని.. 'స్వస్థ్ భారత్, శ్రేష్ఠ భారత్'కు ఇది తొలి అడుగు అని గవర్నర్ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

మొదటి పేజీ తరువాయి

నిగమ్లతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం, భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్ను యూపీసీ వోల్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ను కూడా సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3,000 మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే




లక్ష్యంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. నెట్–జీరో సిటీ అభివృద్ధే తెలంగాణ విజన్‌లో కీలక భాగమని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు.

# వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ

## 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలపై విస్తృత చర్చ

## హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సుకు విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 22:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరల్డ్ ఎకనమిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలు, 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్', 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్పై సీఎం వివరించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జనవరిలో దావోస్‌లో జరిగే సదస్సులో తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలోఅప్ సమావేశం ఎంతో ఉపయోగకరమని ఆయన వివరించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఈ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీ4ఐఆర్ (సెంటర్‌ఫర్‌ది ఫోర్త్‌ఇండస్ట్రియల్‌రివ్యాల్యూషన్) నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్ కూడా సీఎం భేటీ అయ్యారు. తెలంగాణలో పరిశ్రమలకు ఉన్న అవకాశాలు, అనుకూల విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఆలోచనను సీఎం పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ఇలాంటి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, సమీప భవిష్యత్తులో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని ఎండీ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' నిర్వహిస్తున్నారని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి చూపుతోందని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లోని విభిన్న అంశాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ విజన్‌లో భాగస్వామ్యం పంచుకుంటామని, రాష్ట్ర ఆర్థిక వృద్ధి ప్రయాణంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరం కలిసి వస్తుందన్న సంకేతాలు ఇచ్చారు. హైదరాబాదులో ప్రతిభావంతమైన మానవ వనరులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సీఎం ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, క్రీడలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఆసియా 2024లో ప్రారంభించిన తెలంగాణ సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై కూడా చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరం భారతదేశంలో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ ఇదేనని, ఇది ఆదర్శ మోడల్‌గా గుర్తింపు సాధించిందని సీఎం గుర్తు చేశారు. పరిశ్రమల అభివృద్ధిలో ఉత్తమ పద్ధతులపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని జెరెమీ జర్గెన్స్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల అభివృద్ధి నమూనా, ఆర్థిక వృద్ధి వ్యూహం, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును వివరించారు. ఇది నెట్–జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా, దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో–డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

# ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో తెలంగాణ రికార్డు

మొదటి పేజీ తరువాయి

పౌర సరఫరాల, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయడం, తెలంగాణ రైతాంగం సంపూర్ణ భాగస్వామ్యమే ఈ విజయానికి కారణమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కిందని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రం ఇంత భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. 2020ఉ21లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమిస్తూ, తాజా ఖరీఫ్ సీజన్‌లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలో కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్న రకాలకు తొలిసారిగా అందించిన బోనస్‌ను కలిపి మొత్తం రూ.18,532.98 కోట్లను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ సిబ్బంది పనితీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), ప్రజాపంపిణీ వ్యవస్థకు సరఫరా చేయడంతో పాటు, తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విదేశీ





ఎగుమతులకు ప్రత్యేక విధి విధానాలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు రైతులకు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ధాన్యం కొనుగోళ్ల ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.38 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ కావడం కూడా ఒక అరుదైన రికార్డేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, అంటే రాష్ట్ర జనాభాలో దాదాపు 85 శాతం మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నామని, ఇందుకు సంవత్సరానికి రూ.13,650 కోట్లు ఖర్చు అవుతోందని వెల్లడించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో నాణ్యత లోపాలు, బ్లాక్ మార్కెట్ అక్రమాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు గోదాముల ఆధునీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిల్వ సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఉందని, ఈ గోదాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని చెప్పారు. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో సైలో విధానంలో ఆధునిక గోదాములు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తేమ నియంత్రణతో నష్టాలను తగ్గించవచ్చని, ప్రారంభ ఖర్చు ఎక్కువైనా దీర్ఘకాలంలో లాభదాయకమని పేర్కొన్నారు. మిల్లింగ్ రంగంపై కూడా మంత్రి స్పందిస్తూ, నిబంధనలు పాటించిన మిల్లర్లకు పూర్తి సహకారం ఉంటుందని, తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ఉండదని స్పష్టం చేశారు. పెరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని మిల్లింగ్ పరిశ్రమకు ప్రోత్సాహక విధానాలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డ్రైయర్లు, పాడీ క్లీనర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని, అన్ని వేళలా రైతులకు అండగా ఉంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ

## ఇద్దరు సభ్యుల బృందం ఏర్పాటు.. మూడు రోజుల్లో నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 22 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్)లో పర్యటించనుంది. నైని కోల్ బ్లాక్ టెండర్లలో తలెత్తిన వివాదం, టెండర్లు రద్దు చేయాల్సిన పరిస్థితి, అందుకు గల కారణాలు సహా అన్ని అంశాలపై ఈ బృందం సమగ్ర విచారణ చేపట్టనుంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృంద సభ్యులుగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విచారణకు మూడు రోజుల గడువు విధించింది. ఈ లోగా సింగరేణిలో పర్యటించి, నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై నివేదిక సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుంది. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్లపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడంతో, తెలంగాణ డిప్యూటీ సీఎం, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే క్రమంలో ఎస్‌సీసీఎల్ కూడా టెండర్ నోటిఫికేషన్‌ను అధికారికంగా రద్దు చేసింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటల నుంచి బిడ్లు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, పాలనాపరమైన కారణాలతో టెండర్లు రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీఆరఎస్ హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా మారిందని, అదే సమయంలో సంస్థ అప్పులు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. సింగరేణి విద్యుత్ వినియోగానికి సంబంధించి జెన్‌కో, ట్రాన్స్‌కోలకు చెల్లింపులు చేయలేదని, టెండర్లు, కాంట్రాక్టులన్నీ కేసీఆర్ కుటుంబం నియంత్రణలోనే జరిగాయని విమర్శించారు. అదేవిధంగా, సింగరేణి సీఎస్ఆర్ నిధుల దుర్వినియోగం, ప్రైవేట్ కంపెనీలకు



నిబంధనలకు విరుద్ధంగా పనులు కట్టబెట్టడం జరిగిందని ఆరోపించారు. గత పదేళ్లలో రూ.32 వేల కోట్లకు పైగా సింగరేణి అప్పులు పెరిగాయని, కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పటి సీఎండీని మరో నాలుగు సంవత్సరాలు కొనసాగించారని, ప్రస్తుతం సింగరేణి ఇన్‌ఛార్జి సీఎండీతోనే నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# కాలిబాట నుండి హెలికాప్టర్ వరకు మేడారం రాక

- హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు, జనవరి 22:** మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుండి కార్ల మీద వచ్చిన భక్తులు నేడు ఎడ్ల బండ్లను వదిలి హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వృధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని, హనుమకొండ జిల్లా కేంద్రం నుండి మేడారం వరకు తిరిగి మేడారం నుండి హనుమకొండ కు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి 31 వేల రూపాయల టికెట్ నిర్ణయించిందని, అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి 4 వేల 8 వందల రూపాయల టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. గతంలో మహా జాతర సందర్భంగా అప్పటి పాలకులు నామమాత్రంగా నిధులు కేటాయించగా నేడు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం గద్దెల పునరుద్ధరణ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం 2 వందల 51 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. నేటి నుండి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్న థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది.

# 27న బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమ్మె

## ఐదురోజుల పని విధానానికి డిమాండ్




**హైదరాబాద్, జనవరి 22:** దేశవ్యాప్తంగా ఈనెల 27న సమ్మె నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగ సంఘాలుహెచ్చరించాయి. 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ప్రకటించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం కన్వీనర్ ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ), జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్(జిఐసి) వంటి సంస్థలలో కొనసాగుతున్న విధంగా తమకు 5 రోజులను అమలు చేయాలని గత 15 ఏళ్లుగా పోరాడుతున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ప్రతి రోజు 42 నిమిషాలు అధికంగా పనిచేస్తామని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ సెక్టార్(ఃజీనీతినిణ ఃూ।ఇబినీస)లో పనిచేస్తున్న వారు సామాజిక జీవితానికి దూరం అవుతున్నందున ఈ విధానాన్ని అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పని దినాలను తప్పనిసరిగా అమలు చేయాలని గత ఏడాది మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల సమ్మెకు పిలుపునివ్వడంతో అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆంజనేయ ప్రసాద్ గుర్తు చేశారు. 9 నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఖాతాదారులు సైతం తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించుకునేందుకు జరుగుతున్న సమ్మెకు మద్దతు పలకాలని ఆంజనేయ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. 2024 మార్చిలో వేతన సవరణ సెటిల్‌మెంట్ సమయంలో మిగతా రెండు శనివారాలు కూడా సెలవు ఇచ్చేందుకు ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ), యూఎఫ్‌బీయూ మధ్య అంగీకారం కుదిరింది. తాజాగా ప్రకటించిన ఈ సమ్మె కార్యరూపం దాలిస్తే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలపై వరుసగా మూడు రోజుల పాటు ప్రభావం పడనుంది. జనవరి 25, 26 తేదీల్లో బ్యాంకులకు సెలవులు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు ఆదివారాలతో పాటు రెండవ, నాలుగో శనివారాలు సెలవు పొందుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి

## బిల్లులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది

## డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క హామీ



**కొమురం భీం, జనవరి 22:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధి దారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. జైనూర్ మండలంలోని జంగాం గ్రామంలో భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు రూ. 3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సంధ్బంగా భట్టి మాట్లాడుతూ.. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పని లో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు. కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటామని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాడుకోవడం కోసం రుణాలు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని మహాలక్ష్మి ల్లాగా ఉన్నారు.. మహిళలకు ఇప్పటికే రూ. 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. మహిళల్ని కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే మేము డబ్బులు కడుతున్నామని తెలిపారు. నాడు వెయ్యి రూపాయలు లేని పరిస్థితిలో ఉన్న మహిళను నేడు బస్సులకు ఓనర్లను చేశాం.. చెప్పినట్టుగానే ధరణి తీసి భూ భారతి తెచ్చామని భట్టి తెలిపారు. కొమరం భీం ప్రాజెక్ట్ కెనాల్ కాలేదు అన్నారు.. వారికి ప్రపోజల్స్ పంపారు.. పనులు త్వరలో ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చారు. దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం ఇస్తున్నాం.. 96 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట, ప్రజా బాట పట్టారు. మీ సమస్యలు పరిష్కారం చేస్తారు. వారిని కలవండని గ్రామస్తులకు సూచించారు. 108 తరహాలో విద్యుత్ సమస్యల పైన 1912 ను సంప్రదించండి విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తారని అన్నారు. మీ ప్రాంత సమస్య లను పరిష్కారం కోసం ఓ అంబులెన్స్ వస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

# ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

## ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం

## యువతకు శిక్షణ అందించాలన్న సిఎం

**దావోస్, జనవరి 22:** దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏ ఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏ ఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఏ ఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఓయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏ ఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్సన్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన ఏ ఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏ ఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ తో కుదిరిన ఎంఓయూ ద్వారా స్టార్టప్‌ల అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్‌లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించ నున్నారు.



# అటెన్షన్ డైవర్షన్ స్కీమ్

## కేటీఆర్‌కు నోటీసులపై బిఆర్ఎస్ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, జనవరి 22:** కెటిఆర్‌కు సిట్ నోటీసులపై బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఇదంతా కేవలం డైవర్షన్ స్కీమ్ అంటూ విమర్శలు గుప్పించారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేక .. నిన్న నాకు, ఇవాళ కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు వెంట పడుతూనే ఉంటామన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా సీఎం ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బామ్మర్ది బాగోతం బయటపెట్టడంతో ఈ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం నుంచి సడీచప్పుడు లేకుండా ఇప్పుడే నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు కాంగ్రెస్ సర్కారు నాటకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పాలన గాలికి వదిలి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నాలు ఇవి. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్టాన్ని ప్రజల కర్మానికి వదిలేసి దావోస్, అమెరికా పర్యటన పెట్టుకున్నారు. సర్కారు డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని న్యాయస్థానాలు తేల్చి చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మొగలి రేకులు సీరియల్ నడిపిస్తోంది. రేవంత్‌రెడ్డి విదేశాల్లో విహరిస్తూ అక్కడి నుంచి వచ్చే వరకు ఈ సీరియల్ నడిచేలా ఎ÷-లాన్ చేసినట్లు అనిపిస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల వెన్ను విరిచారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదం అని నిరంజన్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల క్రితం నమోదైన కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని బీఆర్ఎస్ నేత సోమా భరత్ విమర్శించారు. 'నోటీసు ఇచ్చి .. విచారణకు వచ్చేందుకు కనీసం 24 గంటల సమయం కూడా ఇవ్వలేదు. రెండ్రోజుల క్రితం మరో సీనియర్‌నేత హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చారు. కేవలం ప్రశ్నిస్తున్న పార్టీ లక్ష్యంగానే నోటీసులు ఇస్తున్నారు. సిట్ ఎందుకు వేశారో కూడా తెలియదు. ఒక పద్ధతి లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ అక్రమాలను బయటపెడుతుంటే నోటీసులు ఇస్తున్నారు. విచారణకు కేటీఆర్‌తో పాటు న్యాయవాదిని అనుమతించాలని కోరాం. సాక్షిగా విచారణ చేసినప్పుడు న్యాయవాదిని అనుమతించబోమని ఏసీపీ చెప్పారని భరత్ తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

## పట్టుబడ్డ 270మందికి జైలు శిక్ష



**హైదరాబాద్, జనవరి 22:** 2026 న్యూ ఇయర్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవర్‌లో పట్టుబడిన వారిలో 270 మందికి జైలు శిక్ష విధించారు. 2025 డిసెంబర్ 24 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వందలాది మంది పట్టుబడ్డారు. ఈ కేసుల్లో విచారణ చేపట్టిన నగరంలోని పలు న్యాయస్థానాలు మొత్తం 270 మందికి జైలు శిక్ష విధిస్తూ తీర్పులు వెలువరించాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన నిందితుల వివరాలను వారి కార్యాలయాలు, కళాశాలలకు పంపిస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు సిఫారసులు చేస్తున్నట్లు వెల్లడించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు కోరారు.

# గోద్రేజ్ చైర్మన్‌తో మంత్రుల భేటీ

## ఫ్యూచర్ సిటీలో హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చ

## హైదరాబాద్ సందర్శించాలని కోరి శ్రీధర్ బాబు



**దావోస్, జనవరి 22:** ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు(ఏఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ. 150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు ముఖ్యంగా స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైదరాబాద్‌కు రావాలని శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.



సంపాదకీయం

# గిరిజన జాతర.. మేడారం!

**కొయ్య సెక్కితె బొమ్మరా.. కొలిచి మొక్కితె అమ్మరా..!** అంటూ కవి అందెశ్రీ పాడిన పాట ఎంతో అద్భుతమైనది. అందులో ఆధ్యాత్మిక తత్వ చింతనను బాగా వెలవరించారు. భారతదేశ పురాణఇతిహాసాల్లో విగ్రహాలు, దేవుళ్లు, పూజలు కూడా అంతా నమ్మకం, విశ్వాసం, భక్తిపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే చెట్టు, పుట్టా, గాలీ,నీరు, రాయీరప్పా అన్నీ మనకు దైవాలే. మనకు మేలుచేస్తున్న ప్రకృతిని దైవంగా కొలవడం ఒక్క భారతీయ సంస్కృతిలోనే చూస్తున్నాం. నమ్మకంతో పూజించడం మన ఆచారం. అది దేవత కావచ్చు.. మైసమ్మ, మారెమ్మ ఇలా ఏ రూపంలో అయినా గ్రామదేవతనలు కొలవడం ఆచారంగా వస్తోంది. అలాంటి ఓ అద్భుతమైన ఆచారంతో కోట్లాదిమంది ఆరాధ్యదైవాలుగా వెలిసిన వారే సమ్మక్క- సారలమ్మలు. సామాన్యమైన గిరిజన కుటుంబానికి చెందిన వీరు అసామాన్యంగా భక్తులు మనస్సులో నిలిచిపోయారు. కేవలం గిరిజనుల నమ్మకం ఇప్పుడు సమస్త జనజాతికి నమ్మకంగా, ఆరాధ్యంగా ఆ దేవతలు వెలిశారు. రెండేళ్లకోమారు జరిగే మేడారాం గిరిజన జాతర చూస్తే..ఆ అమ్మలు జనహృదయంలో ఎంతగా గూడుకట్టుకున్నారో చెప్పలేం. ఇదంతా అమ్మల మీద ఉన్న గౌరవం కావచ్చు..నమ్మకం కావచ్చు.. విశ్వాసం కావచ్చు.. కొలిచి మొక్కిన వారికి కొండంత వేల్పులుగా వారు నిలిచి పోయారు. గుడిలేదు.. గంటలు లేవు...కట్టుబాట్లు లేవు..పూజలు, ఆరాధనలు, హారతులు వంటివి ఏవీ లేకుండా నేరుగా అమ్మలను తలచుకుని రావడం అన్న ఆధ్యాతిక జాతర బహుశా ప్రపంచంలో ఎక్కడా కానరాదు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రారంభం కాబోతున్నది. ప్రారంభానికి ముందే వేలాదిగా భక్తులు తరలివచ్చి గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇది కేవలం జాతర మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు మేడారం అమ్మవార్లను దర్శించుకుంటారు. కుంభమేళా తర్వాత కోట్ల సంఖ్యలో భక్తులను ఆకర్షించే అతిపెద్ద ఉత్సవంగా నిలిచింది. నాలుగు రోజుల జాతరలో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది గద్దెలను అభివృద్ధి చేశారు. జాతరకు నెల ముందు నుంచే లక్షలాది మంది మేడారానికి పోటెత్తారు. నిజానికి వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లి-కూతుర్లు... తెలంగాణ ప్రాంతాన్ని కాకతీయ రాజులు సుమారు 700 సంవత్సరాలు పరిపాలించారు. సమ్మక్క సారలమ్మలు జగిత్యాల జిల్లా ప్రాంతానికి చెందిన గిరిజన జాతికి చెందినవారు. గిరిజనుల దొర మేడరాజు అడవిలో వేటాడుతుండగా.. ఒక పుట్టపై పులులు, సింహాలు కాపలాగా ఉన్న పసిపాప సమ్మక్కను చూసి.. ఆ పాపను తీసుకెళ్లి పెంచుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది. అప్పటి వరకు కరువు.. కాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు... సమ్మక్క రాకతో సమస్యలు తగ్గిపోయాయి. అంతేకాదు.. ఎలాంటి జబ్బునైనా ఆమె చేతి పసరుతో రోగాలు నయమయ్యా యని చెబుతుంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత సమ్మక్కను మేడారం పాలకుడు.... గిరిజన దొర...తన మేనల్లుడు అయిన పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవనంలో సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు కలిగారు. మేడరాజు పొలవాస ప్రాంతానికి కోయ రాజు కాగా... పగిడిద్ద రాజు మేడారాన్ని పాలించాడని చరిత్ర చెబుతోంది. కాకతీయ సామ్రాజ్యం విస్తరణలో భాగంగా, కాకతీయ మొదటి ప్రభువు మేడరాజు పాలించిన ప్రాంతాన్ని ఆక్రమించేందుకు దండెత్తాడు. ఈ దాడిని తట్టుకోలేక మేడరాజు తన కుమార్తె సమ్మక్క దగ్గర మేడారంలో ఆశ్రయం పొందుతాడు. పగిడిద్ద రాజు కాకతీయుల సామంతుడిగా ఉంటూ, వారికి ప్రతి నెలా కప్పం కట్టేవాడు. మూడు సంవత్సరాలుగా ఏర్పడిన కరువుల వల్ల కప్పం కట్టలేకపోవడం... మేడరాజుకు ఆశ్రయం ఇవ్వడం వంటి కారణాలతో కాకతీయులు ఆగ్రహించి మేడారంపై దండెత్తారు. కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొనేంత బలం లేకపోయినా.. పగిడిద్ద రాజు, సమ్మక్క, సారక్క, వారి పిల్లలు సారలమ్మ, నాగులమ్మ, జంపన్నతో సహా కోయ ప్రజలంతా యుద్ధానికి సిద్ధమయ్యారు. బలమైన ఆయుధాలు, గుర్రాలు, ఏనుగులతో వచ్చిన కాకతీయ సైన్యంతో వందల సంఖ్యలో ఉన్న కోయ ప్రజలు బాణాలు, మొండి కత్తులతో భీకరంగా పోరాడారు. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ వీరమరణం పొందారు. కుటుంబ సభ్యుల మరణాలను చూసిన జంపన్న.. అవమానాన్ని భరించలేక పక్కనే ఉన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తున్నారు. తన కుటుంబ సభ్యులందరూ మరణించారని తెలిసిన సమ్మక్క, ఏమాత్రం వెనుకాడకుండా కాళీమాతలా విజృంభించి శత్రువులను ఎదుర్కొంది. అయితే, వెనుక నుంచి ఒక సైనికుడు దొంగచాటున పొడిచి సమ్మక్కను తీవ్రంగా గాయపరిచాడు. రక్తం కారుతుండగానే ఆమె చిలుకల గుట్ట వైపు వెళ్లి, నెమలినార చెట్టు కింద ఉన్న పుట్ట దగ్గర కుంకుమ భరిణెగా మారి అదృశ్యమైందని చెబుతుంటారు. సమ్మక్క అదృశ్యమైన తర్వాత, గిరిజన ప్రజలకు ఆకాశం నుంచి కొన్ని మాటలు వినిపించాయి. 'ఈ గడ్డమీద పుట్టిన ప్రతి ఒక్కరూ వీరుడిలా రాజ్యాన్ని పాలించాలని, ఇక్కడ రెండు గద్దెలు కట్టి రెండేళ్లకొకసారి ఉత్సవం జరిపిస్తే వారి కోరికలు నెరవేరుస్తాను' అని ఆ మాటల సారాంశం. ఈ మాటలను అమ్మ ఆదేశంగా భావించిన గిరిజనులు.. అప్పటి నుంచి అమ్మలకు జాతర నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంలో ఈ మహా జాతర జరుగుతుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరలో అనేక సంప్రదాయాలు పాటిస్తారు. మొదటిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకొస్తారు. రెండవ రోజు చిలుకల గుట్టలోని కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు. మూడవ రోజు అమ్మవార్లు సమ్మక్క, సారక్క ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. నాలుగవ రోజు సాయంత్రం వారికి ఆవాహన పలికి తిరిగి వనప్రవేశం చేయిస్తారు. దీంతో మేడారం జాతర ముగుస్తుంది. ఈ పూజలను వంశపారంపర్యంగా గిరిజన పూజారులే నిర్వహిస్తారు. అమ్మవార్లకు బంగారంగా బెల్లాన్ని సమర్పించు కోవడం ఇక్కడి ప్రత్యేక ఆచారం.

# వీబీ జీ రామ్ జీకు వ్యతిరేకంగా ఆందోళన

- పార్లమెంట్ వేదికగా పోరాడుతాం
- విపక్ష నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, జనవరి 22:** ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ బిల్లు 'వీబీ జీ రామ్ జీ'కు వ్యతిరేకంగా పేద ప్రజలంతా ఏకం కావాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. కేంద్రం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని వెనక్కి తీసుకుని ఎంజీఎన్ఆర్ఈజీఏను పునరుద్ధరించేంత వరకూ తాము పోరాడతామని చెప్పారు. దీనిపై పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లోనూ పోరాటం సాగిస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం ఉద్దేశం, గతంలో తీసుకువచ్చిన 'మూడు నల్ల వ్యవసాయ చట్టాల' ఉద్దేశం ఒకటేనని విమర్శించారు. జవహర్ భవన్‌లో గురువారం నాడు జరిగిన నేషనల్ ఎంజీఎన్ఆర్ఈజీఏ కార్మికుల



సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశానికే చరమగీతం పాడాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. రాజుల పాలనలా ఇండియాను మార్చాలని బీజేపీ అనుకుంటోందన్నారు. పేద ప్రజలందరికీ పని హక్కును ఎంజీఎన్ఆర్ఈజీఏ కల్పిస్తే, ఆ ఉద్దేశాన్ని దెబ్బతీయడమే బీజేపీ, మోదీ కోరిక అని తప్పుబట్టారు. కొద్దికాలం క్రితం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వాళ్లు తెచ్చారని, అంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాటం జరిపామని, రైతులు దాన్ని అడ్డుకున్నారని గుర్తు చేసారు. దాంతో ఆ నల్ల చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. రైతుల విషయంలో అప్పుడు చేసినట్టే ఇప్పుడు అదే పని కార్మికుల విషయంలోనూ చేస్తున్నారని అన్నారు. కొత్త చట్టంతో బీజేపీ పాలిత రాష్ట్రాలకే పనులు, నిధులను కేంద్రం కేటాయిస్తుందని చెప్పారు. పేద ప్రజల పని హక్కును కేంద్రం హరిస్తూ, ఆధునిక భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని కుట్ర జరుపుతోందని రాహుల్ ఆరోపించారు. కేంద్రాన్ని అడ్డుకునేందుకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ప్రతిఒక్కరూ ఐక్యంగా నిలబడినప్పుడే కేంద్రం వెనక్కి తగ్గుతుందన్నారు. ఈ సదస్సులో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరువనంతపురం-చర్లపల్లి మధ్య
# అమృతభారత్ ఎక్స్‌ప్రెస్

నేడు కేరళలో జెండా ఊపనున్న ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ,జనవరి 22:** తెలుగు రాష్ట్ర రైల్వే ప్రయాణికులకు శుభవార్త. మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తెలుగు ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా ఈ అమృత్ భారత్ రైలు నడవబోతోంది. 23న శుక్రవారం కేరళ రాజధాని తిరువనంతపురం నుంచి ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. తిరువనంతపురం- చర్లపల్లి మధ్య ఈ అమృత భారత్ రైలు నడవనుంది. అప్పటికే చర్లపల్లి-ముజఫర్ పూర్ (బీహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. తిరువనంతపురం-చర్లపల్లి మధ్య నడిచే ఈ రైలు తెలంగాణకు కేటాయించిన రెండో అమృత్ భారత్ రైలు. ఈ రైలు ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి ఉదయం 7.15కు బయలుదేరి.. మరుసటి రోజు (బుధవారం) మధ్యాహ్నం 2.45కు తిరువనంతపురం చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరిగి బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి, తర్వాతి రోజు రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. రైలు తెలంగాణలోని నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆధునిక పద్ధతుల్లో, స్వదేశీ సాంకేతికతతో డిజైన్ చేశారు. వివిధ సౌకర్యాలను అందించే ఈ రైళ్లు అందుబాటు ధరల్లోనే ప్రయాణికులకు సేవలు అందించబోతున్నాయి.

# స్వల్పంగా దిగివచ్చిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ,జనవరి 22 :** బంగారం.. వెండి ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. గత కొద్దిరోజులగా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గోల్డ్, సిల్వర్ పోటాపోటీగా రాకెట్‌లా దూసుకుపోయాయి. సరికొత్త రికార్డ్‌లు సృష్టిస్తూ కొనుగోలుదారులను బెంబేలెత్తించాయి. అలాంటిది బుధవారం అగ్ర రాజ్యాధినేతల నుంచి వచ్చిన సానుకూల ప్రకటనలు పసిడి పరుగులకు బ్రేక్‌లు పడేలా చేశాయి. భారతదేశంతో వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకుంటున్నట్లు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా లేయెన్ ప్రకటించారు. అలాగే అతి త్వరలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని ట్రంప్ ప్రకటించారు. ఈ ఇద్దరి నేతల ప్రకటనతో బంగారం, వెండి ధరలు దిగొచ్చినట్లుగా కనబడుతోంది. ఈరోజు తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. ఇది కూడా చదవండి: ÷సబీపూ: 'బోర్డ్ ఆఫ్ పీస్'పై అగ్ర రాజ్యాలు ఘర్షణ.. కారణమిదేనా!? తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,54,310 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.2,100 తగ్గడంతో రూ.1,41,450 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,720 తగ్గడంతో రూ.1,15,730 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక సిల్వర్‌కు బ్రేకులు పడ్డాయి. ఈరోజు కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.3,40,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది.





# భోజ్‌శాలలపై సుప్రీం కీలక ఆదేశాలు

ఇరు మతస్థుల పూజలు, ప్రార్థనలకు అనుమతి

**భోపాల్, జనవరి 22:** మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల ఆలయం-కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రార్థనల విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాంతంలో శుక్రవారం హిందూ, ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. వసంత పంచమి సందర్భంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ హిందూ మతస్థులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ ముస్లింలు శుక్రవారం ప్రార్థనలు చేసుకోవచ్చని అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాల్లో పేర్కొంది. నమాజ్ చేసుకునేందుకు వచ్చే ముస్లిం కమ్యూనిటీ వ్యక్తుల జాబితాను జిల్లా యంత్రాంగానికి అందజేయాల్సి ఉంటుందని సీజేఐ సూర్య కాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పాంచోలితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఇరువర్గాల వారు పరస్పరం గౌరవించుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని సూచించింది. భోజ్‌శాల 11వ శతాబ్దం నాటి కట్టడమని, సరస్వతీ దేవి ఆలయమని హిందువుల వాదనగా ఉంది. ముస్లింలు దీనిని కమల్ మౌలా మసీదుగా పిలుస్తుంటారు. 2003లో ఇందుకు సంబంధించి ఏఎస్ఐ ఆదేశాలు ఇచ్చింది. శుక్రవారం నమాజ్‌లు మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ చేసుకోవచ్చని, హిందువులు వసంత పంచమి పూజలు నిర్వహించుకోవచ్చని, ప్రతి మంగళవారం వారికి అనుమతి ఉంటుందని సుప్రీం ఆదేశాల్లో పేర్కొంది. అయితే.. వసంత పంచమి శుక్రవారం నాడు వస్తే ఎలాంటి ఏర్పాట్లు చేయాలనేది అందులో పేర్కొనలేదు. ఈసారి జనవరి 23న వసంత పంచమి, శుక్రవారం కలిసి రావడంతో ఇరువర్గాలు తమ మతపరమైన ప్రార్థనలు నిర్వహించు కునేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరాయి.

# ఎర్రచందనం పట్టివేత

**రైల్వే కోడూరు,జనవరి 22:** అక్రమంగా కారులో తరలిస్తున్న 28ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే కోడూరు టాస్క్ ఫోర్స్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో నెల్లూరు- గూడూరు మార్గంలో వెళుతున్న వాహనాలను తనిఖీ చేపట్టారు. వీరు వెంకటాచలం చెక్ పోస్టు వద్దకు చేరుకోగా, ఒక మోటారు సైకిల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, వీరితో పాటు వెనకే వస్తున్న ఒక కారును అడ్డగించి,కారును ఆపిన వెంటనే అందులోని వ్యక్తులు దిగి పారిపోయే ప్రయత్నం చేయగా టాస్క్ ఫోర్సు పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని కారులో తనిఖీ చేయగా అందులో 28ఎర్రచందనం దుంగలు లభించాయని అన్నారు. నలుగురిని నెల్లూరు,తిరుపతి జిల్లాలకు చెందిన వారిగా గుర్తించి వీరిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

# క్రొయేషియాలో భారత ఎంబసీపై దాడి..

ఎంఈఏ తీవ్ర అభ్యంతరం

**న్యూఢిల్లీ:** ఐరోపా దేశం క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి ఖలీస్థానీ వేర్పాటువాదులు చొరబడి విధ్వంసం సృష్టించడంపై భారత్ ఘాటుగా స్పందించింది. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో కోరింది. వియన్నా తీర్మానం ప్రకారం దౌత్య ప్రాంగణంలో నిబంధనల ఉల్లంఘన జరగరాదని, ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా రక్షణ కల్పించాల్సి ఉంటుందని ఎంఈఏ పేర్కొంది. 'భారత వ్యతిరేక శక్తులు మా రాయబార కార్యాలయంలో చొరబడి విధ్వంసం సృష్టించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ వ్యవహారాన్ని ఢిల్లీ, జాగ్రెబ్‌లోని క్రొయేషియా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాం. ఇలాంటి ఘటనలు వాటి వెనుక ఉన్న వ్యక్తుల స్వభావం, ఉద్దేశాలను సూచిస్తాయి. చట్టాన్ని అమలుచేసే సంస్థల అధికారులు వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలి' ఎంఈఏ పేర్కొంది. కాగా, జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి కొందరు ఖలిస్థాన్ వేర్పాటువాదులు చొరబడి విధ్వంసం సృష్టించినట్లు గురువారం ఉదయం వార్తలు వెలువడ్డాయి. భారత రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఈయూ నేతలు న్యూఢిల్లీలో పర్యటించనున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది.

### క్రొయోషియాలో మోదీ పర్యటన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది క్రొయేషియాలో పర్యటించారు. ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా కూడా ఆయన రికార్డును సొంతం చేసుకున్నారు. జాగ్రెబ్‌లో మోదీకి క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ సాదర స్వాగతం పలికారు. ద్వైపాక్షిక సమావేశంలో ఇరువురు నేతలు పాల్గొన్నారు. భారత విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్



మిస్రీలు కూడా హాజరయ్యారు. మోదీ పర్యటనలో వ్యవసాయం, సంస్కృతి, సైన్స్ రంగాల్లో నాలుగు ఎంఓయూలపై సంతకాలు .జరిగాయి.

## మరిన్ని పదవులు పొందాలి



**నేటిసాక్షి : జగదేవ్ పూర్:** ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గ్రూప్ 3 కి ఎంపికైనా నరేష్ మరిన్ని ఉన్నత పదవులు పొందాలనీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరేష్ ఇటీవల గ్రూప్ త్రీకి ఎంపికై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం ఆయనను పీఏటి ఆధ్వర్యంలో సన్మానించారు ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ నరేష్ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శారద, అడిషనల్ జనరల్ సెక్రటరీ దేవ దాస్, కోశాధికారి శౌరి, ప్రభాకర్, శంకరయ్య హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరం



**నేటిసాక్షి : జగదేవపూర్ :** సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం అలి రాజపేట గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధకశాఖ వారు సంయుక్తంగా డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో గ్రామసర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు గర్భనిర్ధారణ పరీక్షలు గర్భోత్పత్తి ఇంజక్షన్లు దూడలకు నట్టల నివారణ మందులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గోపాలమిత్ర సేవలను పాడి రైతులు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను ఉపయోగించుకొని పాడి సంపదను పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవింద్ పౌల్, మాజీ సర్పంచ్ లక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామపంచాయతీ సభ్యులు ఓఎస్ హరి, గోపాలమిత్ర, భాస్కర్ గౌడ్ గోపాలమిత్రలు యాదగిరి, గౌరయ్య, కనక స్వామి, పాడి రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**మండల విద్యాధికారి శోభారాణి**



**నేటి సాక్షి (కరీంనగర్):** వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు వసంత పంచమిని పురస్కరించుకొని ముందస్తుగా చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి శోభారాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనేక వసతులు, నాణ్యమైన విద్య అందించబడుతుందని గ్రామస్తులు సద్వినియోగం చేసుకొని పాఠశాలను బలోపేతం చేయాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాగంపేట చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన నూతన సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్,ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు మండల విద్యాధికారికారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు పాఠశాల ఉపాధ్యాయ బృందం సంపత్, కరుణాకర్ రెడ్డి,అనిల్ కుమార్, పుష్పలత,పద్మావతి అంగన్వాడి సిబ్బంది వాణి,కమల మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు నర్సమ్మ, అక్షయ తదితరులు పాల్గొన్నారు

## రోడ్ల వెంట మృతదేహం ఖననం..

**సోద్యం చూస్తున్న గ్రామపంచాయతీ అధికారులు.**



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండల కేంద్రంలో గురువారం నాయి బ్రాహ్మణుల కులానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందగా వైకుంఠధామానికి వెళ్లకుండా జాతీయ రహదారి అయిన. కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి పక్కన దాన సంస్కారాలు నిర్వహించారు ప్రభుత్వం ఎంతో పట్టుదలతో వైకుంఠ ద్వారాలు నిర్మించిన అక్కడికి వెళ్ళకుండా రోడ్లవెంట ఖననం చేయడాని ఆశ్చర్యానికి గురిజేసింది. నిత్యం రోడ్డు రద్దీగా ఉన్న ప్రదేశంలో శవానికి దాన సంస్కరాలు చేశారు దీని వలన రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు కనీస స్మశాన వాటికకు. వెళ్లాలని కూడా తెలియజేయకుండా పట్టించుకొని అధికారులు.

## రాజకీయ కక్షలో భాగమే

**వరుస నోటీసులు" యువ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి**



**నేటి సాక్షి : జోగులాంబ గద్వాల జిల్లా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ గారికి నోటీసులు ఇవ్వడం పై జిల్లాయువ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి మండిపడ్డారు..నిన్న హరీష్ రావుకి,నేడు కేటీఆర్‌కి నోటీసులతో కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంది. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పలేరు, ఆరు గ్యారంటీల అమలుచేయరు....వీటి నుండి ప్రజలదృష్టి మరలించటానికే ఇలాంటి చర్యలు.నోటీసులు, కేసులు, విచారణలు అంటూ అటెన్షన్, డైవర్షన్ తో ఎన్ని రోజులు తప్పించుకుంటారు.ఇలా ఎన్ని సార్లు నోటీసులు ఇచ్చిన, ఎంత మందికి నోటీసులు ఇచ్చినా బీఆర్ఎస్ సైనికులు భయపడరు అనే విషయాన్ని ఈ కాంగ్రెస్ పార్టీ తెలుసుకోవాలి కేసులు కొత్త కాదు కొట్లాట కొత్త కాదు అన్ని గాజుల కృష్ణ రెడ్డి అన్నారు.

# వాహనాలను భద్రంగా.. బాధ్యతతో నడపాలి




- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే
- తిప్పాపూర్ బస్ స్టాండ్ నుండి కోరుట్ల బస్ స్టాండ్ వరకు స్వయంగా ఆటో నడిపిన విప్

**నేటి సాక్షి ప్రతినిధి, వేములవాడ : (కోక్కుల వంశీ )** ప్రతి వాహనదారుడు తమ వాహనాన్ని భద్రంగా.. బాధ్యతతో నడపాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల (సడక్ సురక్ష అభియాన్) కార్యక్రమాన్ని వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో గురువారం జిల్లా రవాణా శాఖా ఆద్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే హాజరై ప్రారంభించారు. ట్రాఫిక్ సిగ్నల్ రంగులలాగా సిద్దం చేసిన బెలూన్లను, శాంతి కపోతాలను ఎగురవేసారు.రోడ్డు భద్రతకు సంబంధించిన స్టికర్లను వాహనాలకు అతికించారు.అనంతరం తిప్పాపూర్ బస్ స్టాండ్ కోరుట్ల బస్ స్టాండ్ వరకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు స్వయంగా ఆటో నడుపుతూ వెళ్లారు..

# ప్రజల ప్రభుత్వం అంటే ఇదే, సంక్షేమం, అభివృద్ధి

- రెండింటినీ సమానంగా అమలు చేస్తున్నాం
- గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

- తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలనకు నాంది పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గారు స్పష్టం చేశారు.



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఈ రోజు కెరమెరీ మండల పరిధిలోని మోడీ, ఝరి గ్రామాల్లో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో పాల్గొని ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర సందర్భంగా ఈ ప్రాంతాన్ని సందర్శించిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఉగాది పండుగ రోజుల్లో మూడు రోజుల పాటు ఈ ప్రాంతంలో గడిపి, ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్న సందర్భాలను స్మరించుకున్నారు. అప్పుడు ప్రజల కష్టాలను చూశాం ఈ రోజు అదే ప్రజల కోసం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేస్తున్నామని తెలిపారు. మాటల్లో కాదు – చేతల్లో చూపించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని భట్టి విక్రమార్క గారు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యానికి భిన్నంగా, ఈ ప్రభుత్వం ప్రజల మధ్యే ఉంటూ ప్రజల కోసమే పనిచేస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షులు కె. విశ్వప్రసాదరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మునీర్ అహ్మద్, కుసుమ్ రావు, స్థానిక సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న 28ఎర్రచందనం



- దుంగలు స్వాఃధీనం
- కారు, ద్విచక్రవాహనం సీజ్
- నలుగురు స్మగ్లర్లు అరెస్టు

**నేటి సాక్షి తిరుపతి :** నెల్లూరు జిల్లా వెంకటాచలం చెక్ పోస్టు వద్ద అక్రమంగా కారులో తరలిస్తున్న 28ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్సు పోలీసులు, ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న కారును, పైలట్ వాహనంగా వ్యవహరిస్తున్న ద్విచక్ర వాహనాన్నిసీజ్ చేశారు. నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ అధ్వర్యంలో ఏఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో, డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద టీమ్, స్థానిక ఎఫ్బీఓ ఎన్. ఆదిశేషయ్యతో కలసి, తమకు అందిన సమాచారంతో నెల్లూరు– గూడూరు మార్గంలో వెళుతున్న వాహనాలను తనిఖీ చేపట్టారు. వీరు వెంకటాచలం చెక్ పోస్టు వద్దకు చేరుకోగా, ఒక మోటారు సైకిల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వీరితో పాటు వెనకే వస్తున్న ఒక కారును అడ్డగించి నిలిపారు. కారును ఆపిన వెంటనే అందులోని వ్యక్తులు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. అయతే టాస్క్ ఫోర్సు పోలీసులు నలుగురిని పట్టుకోగలిగారు. కారులో తనిఖీ చేయగా, అందులో 28ఎర్రచందనం దుంగలు లభించాయి. నలుగురిని నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. వీరిని దుంగలుతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. వీరిని డీఎస్పీ వీ. శ్రీనివాస రెడ్డి, ఎసిఎఫ్ జె. శ్రీనివాస్ విచారించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా వైద్యుల నూతన కమిటీ

- అధ్యక్షురాలిగా డా. సునితా రవికిరణ్ ఏకగ్రీవ ఎన్నిక







**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో కోరుట్ల మహిళా వైద్యుల విభాగానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ మహిళా విభాగ అధ్యక్షురాలు డాక్టర్ స్వీతి అనూప్ రావు సమక్షంలో జరిగిన సమావేశంలో అధ్యక్షురాలిగా డా. సునితా రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా డా. గీత ఇంద్రనీల్, కోశాధికారిగా జి. విజయశ్రీ, ఉపాధ్యక్షురాలిగా డా. ప్రియాంక, సహాయ కార్యదర్శిగా డా. అనురాధ జగదీశ్వర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణకు వాక్సినేషన్‌పై అవగాహన కల్పించడం, మహిళల భద్రత, పోషకాహారం, కెరియర్ గైడెన్స్ వంటి అంశాలపై విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, ఇతర ప్రముఖులు నూతన కమిటీని అభినందిస్తూ, మహిళల ఆరోగ్య పరిరక్షణలో వారి సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

నేటి సాక్షి–మేడిపల్లి సీఎం డిప్యూటీ సీఎం వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలభిషేకం చేసిన మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి మండల నాయకులు మేడిపల్లి మండలం కాచారం గ్రామనికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు 2 కోట్ల 90 లక్షలతో సబ్ స్టేషన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్,చిత్రపటాలకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు కలిసి వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగింది ఈ సందర్భంగా రమేష్ రెడ్డి, మాట్లాడుతూ జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకర్గ పరిధిలోని మేడిపల్లి మండలం కాచారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో 2 కోట్ల 90 లక్షలతో నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేస్తూ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. అని గత కొన్ని రోజులుగా కాచారం రైతులు గ్రామస్తులు ఎదురు చూస్తున్న సబ్ స్టేషన్ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.. అని ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. నూతన సబ్ స్టేషన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గుగ్గిల్ల రమేష్, విలయతాబాద్ గ్రామ సర్పంచ్ వేముల లింబాద్రి, కాచారాం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేశెట్టి గంగాధర్, కాచారం గ్రామ ఉపసర్పంచ్ దేశెట్టి రాజేందర్, మాజీ సర్పంచ్ వెల్మ నవీన్ రెడ్డి, పానుగంటి రాజేష్,మాజీ సర్పంచ్ కొప్పెర జలంధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మేదరి రాజన్న, పానుగంటి రాజేష్, గ్రామ రైతులు సాయి రెడ్డి, తిరుపతి రెడ్డి, సాయన్న, పెరుక రెడ్డి ,గ్రామ యువకులు మహేష్, సంతోష్ రెడ్డి, గంప వెంకన్న, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బందలకు లోబడి ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**నేటి సాక్షి జగిత్యాల(ఇమ్మడి విజయ్ కుమార్):** ఎన్నికల విధులు ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వర్తించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. గురువారం రోజున జగిత్యాల జిల్లా ఐడి ఓసి మీటింగ్ హాల్‌లో మున్సిపల్ ఆర్వోలు, ఏఆర్‌ఓలకు ఎలక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఇందులో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఆర్వో, ఏఆర్వో లకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలకమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో ఎన్నికల నిబంధనలు అనుసరించి నిర్వహించాలనే బాధ్యత ఆర్వో, ఏఆర్వో పైన ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల విధులు చాలా కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణం గా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, బ్యాలెట్ బాక్స్ ఎలా సీల్ చేయాలి, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పి ఓ డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలని, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహణ, చైర్మన్, వైస్ చైర్మన్ నియామక పత్రాలు ఇవ్వడం తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్వో, ఏఆర్వో ల కార్యాచరణ, విధులు, బాధ్యత లు తీసుకోవలిసిన జాగ్రత్త లను పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్స్ వివరించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు సమన్వయం చేసుకొని అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్,కోరుట్ల మెట్పల్లి ఆర్డీవోలు జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్స్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నాం




- ఎమ్మెల్యే బిఎల్ఆర్
- జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలలో
- ఎమ్మెల్యే బిఎల్ఆర్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డిఎస్పీ రాజశేఖర్ రాజు

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని త్వరలో మిర్యాలగూడ పట్టణంల మొత్తం ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ లో మిర్యాలగూడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డిఎస్పీ రాజశేఖర్ రాజు తో కలిసి ఎమ్మెల్యే బిఎల్ఆర్ జాతీయ రోడ్డు భద్రతా అవగాహన మహోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆటో యూనియన్, లారీ అసోసియేషన్, మరియు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, మిర్యాలగూడ పట్టణంలో ఒకే ప్రధాన రహదారి కావడంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, ఈ సమస్యను నియంత్రించి ప్రమాదాలు అరికట్టెందుకు, త్వరలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనునట్టు తెలిపారు. అలాగే యువకులు అందరూ హెల్మెట్స్ ధరించి, ప్రమాదాలు జరగకుండా తమ ప్రణాలను భద్రంగా ఉంచుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా

- జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**నేటి సాక్షి రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** రాయికల్ పట్టణ సమగ్ర అభివృద్ధి కి కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే స్థానిక పద్మశాలి సేవాసంఘం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 24తేదీ శనివారం రోజున రూ 7 కోట్ల 20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భూమి పూజ చేయనున్నారని అన్నారు. రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం లో ఏర్పాటు చేయనున్న మంత్రి సభను ప్రజలు నాయకులు విజయవంతం చేయాలని కోరారు. మహిళా సంఘాలకు 11 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాయికల్ పట్టణం లో గతంలో పని చేసిన కాంట్రాక్టర్లకు 3 కోట్ల బిల్లులు చెల్లింపు చేయడం జరిగిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం లో 4 కోట్ల పనులు రాయికల్ పట్టణం లో చేయటం జరిగిందని 82 లక్షలతో నూతన పనులకు అనుమతులు రావడం జరిగిందని తెలిపారు. రాయికల్ పట్టణ అభివృద్ధి కి 15 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని 7.20 కోట్ల లో 1 కోటి తో మున్సిపల్ పార్కు అభివృద్ధి చేస్తున్నామని. 20 లక్షల తో డివైడర్ పనులు, 3.15 కోట్ల సీసీ రోడ్లు డ్రైనేజీ లు పనులు పట్టణం లో జంక్షన్ ల అభివృద్ధి కి 1 కోటి కేటాయింపు చేయటం జరిగిందని తెలిపారు. 5 కోట్ల నిధులు స్టార్మ్ వాటర్ డ్రైనేజీ కి 4 చోట్ల పెద్ద డ్రైనేజీలకి కేటాయింపు చేయటం జరిగిందని పేర్కొన్నారు. 15 కోట్ల తో రాయికల్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్మశాన వాటిక అభివృద్ధి కోసం 50 లక్షలు, 1 కోటి రూపాయలు రాయికల్ రామాజీ పెట్ వీధి దీపాలు కు కేటాయించడం జరిగిందని అన్నారు. మహిళా సంఘాల కు 11 లక్షల వడ్డీ లేని రుణాలు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయటం జరుగుతుందని అన్నారు. నా పై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అగ్రిమెంట్ లేకుండా ఎలాంటి పనులు సాగవని అన్నారు. జగిత్యాల పట్టణంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రజల కోసం అభివృద్ధి పనులు చేపట్టానని అన్ని తెలిసిన వాళ్ళే పదే పదే విమర్శలు చేస్తే అబద్ధాలు నిజం కావని అన్నారు. గెలిపించిన ప్రజల కోసం అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోర హనుమండ్లు, గంగ్ర రమాదేవి, అచ్యుత రావు, ఏనుగు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు .



# రహదారి భద్రతపై.. బాధ్యతగా వ్యవహరించాలి




- మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** రహదారి భద్రతపై ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సందర్భంగా పట్టణంలోని ఎస్వి మోడల్ హై స్కూల్‌లో బుధవారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్ హాజరై, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, పాఠశాల బస్సు ప్రయాణ భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో రహదారి భద్రతా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అలీమ్, పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాం సుందర్, రహదారి భద్రతపై విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పాఠశాల టీచర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీని పట్టం కట్టండి

**నేటి సాక్షి కొమురం భీమ్ ఆసిఫాబాద్:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి కొమ్ముల ప్రవీణ్ ఆదేశాల మేరకు యువకులు రాజకీయాల్లో ముందురావాలని జిల్లాలోని మండల, గ్రామాలలో సమస్యలను మీద పోరాటం చేయాలని ప్రతి గ్రామం నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీ ని బలోపేతంచేయాలని యువకులు ఉత్సాహం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ని బిసి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)నియోజకవర్గంలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి కొమ్ముల ప్రవీణ్ ఆదేశాల మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంచిర్యాల జిల్లా ప్రెసిడెంట్ మహేష్ వర్మ, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రెసిడెంట్ వెంకటేష్ ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ముఖ్యంగా యువకులు ముందుకు వచ్చి బి సి, బహుజనులు ఒక్కటి గా ఉండి రెడ్డి,దొరల పాలనకు స్వస్థి చెప్పాలని, జిల్లా, మండల,గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ స్థాయి నుండి సమస్యల పైన పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు,యువకులు రాజకీయాలలోకి రావాలని పార్టీ ఆహ్వానిస్తుందని అన్నారు.రాజ్యాధికార పార్టీ లో చేరేవారు ఈక్రింది సెల్ నంబరు 9949705040 కు ఫోన్ చేయగలరు.కాంగ్రెస్ పార్టీ బి సి లను మోసం చేస్తూ ఇస్తా అన్న రిజర్వేషన్ ఇవ్వకుండా మోసం చేస్తుంది అని అన్నారు .కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు గాడిపెల్లి వెంకటేష్,కోశాధికారి సోనులే రమేష్,పెంచికల్ పేట్ మండల ప్రెసిడెంట్ దామోదర్,



మండల అధ్యక్షులు మందడే బిక్షపతి, బీరయ్యా యాదవ్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరకత శివాలయానికి హీరో



**నేటి సాక్షి రంగారెడ్డి(సుధాకర్ గౌడ్) శంకర్ పల్లి:** రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయానికి నేడు శుక్రవారం స్వామివారి దర్శనానికి సీనియర్ సినీ నటుడు, ప్రముఖ హీరో సుమన్ రానున్నారని ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. మరకత శివాలయం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుండగా ప్రముఖులు స్వామిని దర్శించుకోవడం భక్తుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. హీరో సుమన్ రాకతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకోనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# 26న ఎల్లమ్మ జాతర

**27న శ్రీ అమ్మవారి బోనంకొండ ప్రత్యేక పూజా కార్యక్రమాలు......**

**28న శ్రీఅమ్మవారి మహా పూజ కార్యక్రమాలు....**



**నేటి సాక్షి నారాయణపేట (రిపోర్టర్ ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని లింగంపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ శ్రీ ఎల్లమ్మ దేవత జాతర మహోత్సవాల కార్యక్రమాలు ఈనెల 26 నుండి ప్రారంభం కానున్నాయి. ఇట్టి జాతర మహోత్సవ కార్యక్రమాలు మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుంది. 27న శ్రీ అమ్మవారి బోనంకొండ మహోత్సవాల కార్యక్రమాలను పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. 28న శ్రీ ఎల్లమ్మ వారి మహా మంగళారతి పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ జాతర మహోత్సవ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరుక అవుతారు. జాతర మహోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల నుండి భారీ సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీర్వాదాన్ని పొందుతారు. శ్రీ శ్రీ ఎల్లమ్మ వారి పూజా కార్యక్రమాలు గ్రామానికి చెందిన పూజారులు శంకర్ గౌడ్ పరశురాం గౌడ్, ఎల్లయ్య గౌడ్, ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ జాతర మహోత్సవ కార్యక్రమానికి నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి హాజరై అమ్మవారి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలోని శ్రీ ఎల్లమ్మ వారి పూజా కార్యక్రమాలను భక్తులు నిర్వహించి ఆశీర్వాదం పొందుతారు.

# ఉచిత పశు వైద్య శిబిరాం

**ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కొలకానీ జలందర్**



**నేటి సాక్షి జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్ ):** గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లిలో పశుసంవర్ధక శాఖ పశు గణన అభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కొలకానీ జలందర్ ఉపసర్పంచ్ ఒరగంటి మని సాయి రాం వెటరినరీ డాక్టర్స్ డాక్టర్ కాసారపు తిరుపతి గౌడ్ డాక్టర్ రవీందర్ డాక్టర్ అశోక్ గర్భ కోశ వ్యాధులకు చికిత్స చేసి రైతులకు మందులు అందించినారు వారు మాట్లాడుతూ పాడి రైతులు పశు సంతతి పెంచుకోవడం కోసం పశువులకు గర్భకోశ చికిత్స చేయించుకోవాలి ఎదకు రాని పశువులకు తగిన మందులు వాడుకోవాలి.వెటరినరీ డాక్టర్ తిరుపతి గౌడ్ మాట్లాడుతూ శీతాకాలంలో పశువులు ఏదకు వస్తాయి గనుక పశువైద్యశిబ్బందిచే, గోపాల మిత్రులచే కృత్రిమ గర్భాదారణ చేయించుకుంటే మేలు జాతి రకపు దూడలు జన్మిస్తాయి, జన్మించిన దూడలకు 15 రోజుల నుండి నట్టల నివారణ మందును త్రాగించడం వలన దూడలు ఆరోగ్యంగా ఉంటాయి అని అన్నారు పశు వైద్య సిబ్బంది నిశాంత్ నరసయ్య, గోపాల మిత్రులు శ్రీకాంత్ రవీందర్ పాల్గొన్నారు.

# విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవ్వాలి

**ఎం ఈ ఓ సైదులు**



**నేటిసాక్షి : జగదేవపూర్:** పదిలో ఉత్తమ ఫలితాల లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులు విద్యను అభ్యసించాలని ఎంఈఓ సైదులు పేర్కొన్నారు. గురువారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతున్న క్రమంలో విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పకుండా ప్రత్యేకతలకు హాజరుకావాలని కోరారు. ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధన కోసం విద్యార్థులకు చక్కని విద్య బోధన చేయాలని సూచించారు. ఉదయం సాయంత్రం పూట విద్యార్థులకు స్నాక్స్ అందించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు ముందు విద్యార్థులు సోషల్ మీడియా దూరంగా ఉండాలని పుస్తకాలకు దగ్గర అవ్వాలని వివరించారు. భవిష్యత్తుకు పదో తరగతి తొలి మెట్ట అని ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మున్సిపల్ 14 వ వార్డులో బోర్

**వేసిన జూలకంటి వెంకట్ రెడ్డి...**



**నేటి సాక్షి రంగారెడ్డి జిల్లా(సుధాకర్ గౌడ్), శంకర్‌పల్లి:** శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని 14 వార్డులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూలకంటి వెంకట్ రెడ్డి, జూలకంటి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన బోర్ వేశారు. 14 వార్డ్ లో నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో జూలకంటి వెంకట్ రెడ్డి,తన స్వంత నిధులతో బోర్ వేయడంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# చరిత్ర సృష్టించిన సింధు



## కెరీర్‌లో 500వ విజయం నమోదు

### ఈ ఘనత సాధించిన తొలి భారతీయ షట్లర్ - ఇండోనేషియా మాస్టర్స్ క్వార్టర్స్‌కు చేరిక

**జకర్తా, జనవరి 22**

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అరుదైన రికార్డు సృష్టించారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కెరీర్‌లో 500 విజయాలు సాధించి చరిత్ర లిఖించారు. ఇండోనేషియా మాస్టర్స్-2026లో భాగంగా డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ హోజ్‌మార్క్‌పై గెలిచి ఈ మైలురాయిని చేరుకున్నారు. ప్రపంచంలో మహిళల సింగిల్స్ విభాగంలో ఈ ఘనత సాధించిన ఆరో ప్లేయర్‌గా, భారత్ తరఫున తొలి క్రీడాకారిణిగా సింధు నిలిచారు.

#### వరుస సెట్లలో విజయం

తాజాగా జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో సింధు 21-19, 21-18 తేడాతో లైన్ హోజ్‌మార్క్‌పై వరుస సెట్లలో గెలుపొందారు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 43 నిమిషాల్లోనే ఆటను ముగించారు. హోజ్‌మార్క్‌పై సింధుకు ఇది ఐదో విజయం. ఇప్పటివరకు సింధు తన కెరీర్‌లో 732 మ్యాచ్‌లు ఆడగా, అందులో 500 మ్యాచ్‌ల్లో విజయం సాధించడం విశేషం.

#### క్వార్టర్స్‌లో చైనా క్రీడాకారిణితో పోరు

ఈ విజయంతో సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. తదుపరి మ్యాచ్‌లో చైనా టాప్ సీడ్, వరల్డ్ నెంబర్ 4 చెన్ యూఫీతో తలపడనున్నారు. వీరిద్దరి మధ్య ఇప్పటివరకు జరిగిన 13 మ్యాచ్‌ల్లో చెన్ యూఫీ 7-6 ఆధిక్యంలో కొనసాగుతున్నారు. చివరిసారిగా 2019లో చెన్ యూఫీపై గెలిచిన సింధు, ఈసారి కూడా నెగ్గి రికార్డు సమం చేయాలని భావిస్తున్నారు.

## నేను పరుగు తీసేలోపే..



# అతడు హాఫ్ సెంచరీ కొట్టాడు

### అభిషేక్ శర్మపై సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం

- నా కాలంలో ఆ బంతుల్లో ఒక పరుగు చేసేవాడిని.. ఇతను 50 కొట్టాడు

**హైదరాబాద్, జనవరి 22 :**

భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ యువ సంచలనం అభిషేక్ శర్మపై ప్రశంసల జల్లు కురిపించారు. న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ ఇప్పుడు క్రీడా లోకంలో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం 35 బంతుల్లో 84 పరుగులు చేసి భారత విజయంలో కీలక పాత్ర పోషించిన ఈ యువ ఆటగాడి శైలిని గవాస్కర్ కొనియాడారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ బ్యాటింగ్ వేగాన్ని తన కాలం నాటి క్రికెట్‌తో పోలుస్తూ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

#### ఆశ్చర్యపరిచే బ్యాటింగ్ శైలి

మ్యాచ్ ముగిసిన తర్వాత ఒక క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన సునీల్ గవాస్కర్, అభిషేక్ శర్మ బ్యాటింగ్ పట్ల తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. "ప్రస్తుత తరం ఆటగాళ్ల బ్యాటింగ్ శైలిని చూస్తుంటే అద్భుతంగా అనిపిస్తోంది. అభిషేక్ శర్మ కేవలం 18 బంతుల్లోనే తన అర్థ సెంచరీని పూర్తి చేశాడు. నిజం చెప్పాలంటే, నా కాలంలో నేను ఒక పరుగు తీయడానికి ఎన్ని బంతులు తీసుకునేవాడినో, ఇప్పుడు ఈ కుర్రాడు అన్ని బంతుల్లో ఏకంగా యాభై పరుగులు పూర్తి చేస్తున్నాడు" అని గవాస్కర్ చమత్కరించారు. తన సుదీర్ఘ కెరీర్‌లో గవాస్కర్ రక్షణాత్మక ధోరణికి పేరుగాంచిన సంగతి తెలిసిందే. అందుకే ప్రస్తుత టీ20 ఫార్మాట్‌లో బ్యాటర్లు చూపిస్తున్న ఈ దూకుడును ఆయన వింతగా, అద్భుతంగా భావిస్తున్నారు.

#### హిట్టింగ్ మాత్రమే కాదు.. టైమింగ్ కూడా

అభిషేక్ శర్మ కేవలం కళ్లు మూసుకుని బ్యాట్ ఊపడం లేదని, ప్రతి షాట్ వెనుక ఒక పద్ధతి ఉందని గవాస్కర్ విశ్లేషించారు. "చాలామంది యువ ఆటగాళ్లు కేవలం హిట్టింగ్ చేయడానికే ప్రయత్నిస్తారు. కానీ అభిషేక్ దగ్గర సరైన టైమింగ్ ఉంది. అతను మైదానం నలుమూలల షాట్లు ఆడగలడు. ముఖ్యంగా స్పిన్నర్లపై అతను విరుచుకుపడుతున్న తీరు భారత క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకం" అని పేర్కొన్నారు. కివీస్ బౌలర్లు ఎంత వేగంగా బంతులు వేసినా, ఎంతో ప్రశాంతంగా, భయం లేకుండా వాటిని సరిహద్దులు దాటించాడని, ఇలాంటి నిర్భయమైన క్రికెట్ ఇప్పుడు భారత జట్టుకు చాలా అవసరమని గవాస్కర్ అన్నారు.

## టీ20 వరల్డ్ కప్‌లో స్కాట్లాండ్‌కు ఛాన్స్?

- భారత్‌కు వచ్చేది లేదని తేల్చి చెప్పిన బంగ్లాదేశ్
- నిర్ణయం మార్చుకోకపోతే వేటు తప్పదు: ఐసీసీ హెచ్చరిక
- బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను తీసుకునే యోచన
- 24 గంటల డెడ్‌లైన్ విధించిన అంతర్జాతీయ మండలి



**దుబాయ్/ఢాకా, జనవరి 22 :**

2026 టీ20 వరల్డ్ కప్ కోసం భారత్‌కు తమ జట్టును పంపేది లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మరోసారి స్పష్టం చేసింది. గురువారం ఢాకాలో క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్, సీనియర్ ఆటగాళ్లు, బోర్డు సభ్యుల మధ్య జరిగిన కీలక సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. భారత్‌లో భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నాయని, అందుకే తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ పట్టుబడుతోంది. ఈ నిర్ణయం పూర్తిగా తమ ప్రభుత్వానిదేనని ఆసిఫ్ నజ్రుల్ తెలిపారు.

బంగ్లాదేశ్ అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తిరస్కరించింది. భారత్‌లో ఆటగాళ్లకు ఎలాంటి ముప్పు లేదని స్వతంత్ర భద్రతా సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొంది. టోర్నీకి కొద్ది రోజుల ముందు షెడ్యూల్ మార్చడం అసాధ్యమని తేల్చి చెప్పింది. నిర్ణయం మార్చుకోవడానికి బంగ్లాదేశ్‌కు 24 గంటల సమయం ఇస్తున్నామని, ఒకవేళ రాకపోతే వారి స్థానంలో 'గ్రూప్-సి'లో స్కాట్లాండ్ జట్టును చేరుస్తామని హెచ్చరించింది. దీనిపై ఇప్పటికే బోర్డులో ఓటింగ్ కూడా జరిగినట్లు సమాచారం.

ఐసీసీ అల్టిమేటంపై బీసీబీ ప్రెసిడెంట్ అమీనుల్ ఇస్లాం ఘాటుగా స్పందించారు. ఒక అంతర్జాతీయ సంస్థ ఇలాంటి హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. తమ దేశంలో 20 కోట్ల మంది క్రికెట్ అభిమానులు ఉన్నారని, తాము లేకపోతే ఐసీసీకే భారీ నష్టమని వ్యాఖ్యానించారు. శ్రీలంకను 'కో-హోస్ట్' అని పిలవడాన్ని తప్పుబడుతూ, అది కేవలం 'హైబ్రిడ్ మోడల్' మాత్రమేనని అన్నారు. రాజకీయ ద్వేషంతో తీసుకుంటున్న ఈ నిర్ణయాలు బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వరల్డ్ కప్ నుంచి వైదొలిగితే భవిష్యత్తులో ఐసీసీ నిధులు ఆగిపోవడంతో పాటు, ఇతర దేశాలతో ద్వైపాక్షిక సిరీస్‌లపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా భారత్ వంటి బలమైన బోర్డుతో సంబంధాలు దెబ్బతింటే బంగ్లాదేశ్ క్రికెట్ ఆర్థికంగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఐసీసీ డెడ్‌లైన్ ముగిశాక ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అక్షర్ పటేల్ కు గాయం... టీమిండియా ఆందోళన

**నాగ్‌పూర్, జనవరి 22:** న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టి20 మ్యాచ్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు డారిల్ మిచెల్ కొట్టిన షాట్‌ను ఆపే క్రమంలో బంతి అక్షర్ ఎడమ చేతి చూపుడు వేలికి బలంగా తాకింది. దీంతో రక్తం కారడంతో తన ఓవర్ పూర్తి చేయకుండానే మైదానం నుంచి వెళ్లిపోయారు. మిగిలిన మూడు బంతులను అభిషేక్ శర్మ వేశారు. 2026 టి20 ప్రపంచ కప్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన అక్షర్.. ఈ గాయం కారణంగా టోర్నీకి దూరమవుతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, గాయం తీవ్రతపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.



## జట్టు ఎంపిక కత్తి మీద సాము

### అందరినీ సంతృప్తి పరచలేం.. పక్కన పెడితే ఆటగాడికి కారణం చెప్పాల్సిందే: రోహిత్ శర్మ

**నాగ్‌పూర్, జనవరి 22:** జట్టును ఎంపిక చేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అని, ఈ విషయంలో అందరినీ సంతృప్తి పరచలేమని టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అన్నారు. వచ్చే నెలలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టి20 వరల్డ్ కప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఆయన.. జట్టు ఎంపిక, కెప్టెన్సీ సవాళ్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యం జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇది కెప్టెన్‌కు కత్తి మీద సాము లాంటిదని రోహిత్ పేర్కొన్నారు. అయితే ఒక ఆటగాడిని పక్కన పెట్టినప్పుడు, ఎందుకు ఎంపిక చేయలేదో కచ్చితంగా వివరించాలని అభిప్రాయపడ్డారు. "2022 ఆసియా కప్, వరల్డ్ కప్ సమయంలో శ్రేయస్ అయ్యర్‌ను కాదని, జట్టు సమతుల్యత కోసం దీపక్ హుడాను తీసుకున్నాం. ఈ విషయాన్ని నేను, కోచ్ రాహుల్ ద్రవిడ్ స్వయంగా అయ్యర్‌కు వివరించాం. అలాగే 2023 వన్డే వరల్డ్ కప్‌లో చాహల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో సిరాజ్ విషయంలోనూ ఇదే పద్ధతి పాటించాం" అని రోహిత్ గుర్తు చేసుకున్నారు.





# చిరు మూవీలో కృతిశెట్టి

'వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయబోతున్నారు. కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన రానుంది.

# ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లోకి దురంధర్



బాలీవుడ్‌లో ఎలాంటి భారీ అంచనాలు లేకుండా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసిన లేటెస్ట్ సెన్సేషన్ 'దురంధర్'. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్లింది. ఇండియన్ ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా రూ.1400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పాత్రలో నటించి మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకోగా, సారా అర్జున్ హీరోయిన్‌గా ఆకట్టుకుంది. అలాగే అక్షయ్ ఖన్నా చేసిన స్పెషల్ రోల్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. దురంధర్ మూవీ త్వరలోనే ఓటీటీలో విడుదల కానుంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం జనవరి 30 నుంచి దురంధర్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ వార్త బయటకు రావడంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులతో పాటు, ఇప్పటికే చూసినవాళ్లు కూడా మళ్లీ మళ్లీ చూడాలని ఆసక్తి చూపిస్తున్నారు. ఓటీటీలో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. థియేటర్ కలెక్షన్లతోనే కాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ కొత్త రికార్డ్స్ క్రియేట్ చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఈ సినిమాకు సీక్వెల్ కూడా రాబోతున్న విషయం తెలిసిందే. దురంధర్ సీక్వెల్‌ను మార్చి 19న విడుదల చేయనున్నట్టుగా మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.

# విశాల్ మొగుడు ప్రోమో

తమిళ నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 36వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాకు హిట్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహించబోతుండగా.. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న నాలుగవ చిత్రమిది. ఈ సినిమాకు తెలుగులో 'మొగుడు' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రోమోను విడుదల విడుదల చేసింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'మగ మహారాజు', 'మదగజరాజా', 'యాక్షన్' సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రూపొందుతోంది. ఈ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన ప్రోమో ఫుల్ ఫన్నీగా మరియు మాస్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. ముఖ్యంగా 'మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం' అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ నవ్వులు పూయి-ఽస్తోంది. ఇందులో తమన్నా భర్తను శాసించే భార్యగా కనిపిస్తుంటే, విశాల్ ఇంట్లో పనులు చేసే అమాయకపు భర్తగా నటిస్తూనే.. భార్యకు తెలియకుండా బయట విలన్ల తాట తీసే మాస్ క్యారెక్టర్‌లో అదరగొట్టాడు.




# 26న డేవిడ్ రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల



మంచు మనోజ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చేసింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్, ఇప్పుడు తన తదుపరి ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద గట్టి దెబ్బ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డేవిడ్ రెడ్డి' కి సంబంధించి కీలక ప్రకటన చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ జనవరి 26న, అంటే రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో మెగా యాక్షన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఒక్కసారిగా జోష్ పెరిగింది.ఒక భీకరమైన శకం మొదలవుతోంది అంటూ మనోజ్ పెట్టిన క్యాప్షన్ సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో హింట్ ఇస్తోంది. ఈ చిత్రానికి హనుమ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, 'కె.జి.ఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. అంతేకాకుండా, ఎడిటర్ ఉజ్వల్ కులకర్ణి,౹ ÷ట్ మాస్టర్ సుప్రీమ్ సుందర్ వంటి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పనిచేస్తుండటం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, హ్యాష్ ట్యాగ్‌లు చూస్తుంటే మనోజ్ ఈసారి మాస్ అండ్ వయోలెంట్ లుక్‌లో కనిపించబోతున్నట్లు అర్థమవుతోంది.



## హిందీలో సంక్రాంతికి వస్తున్నాంలో రాశీఖన్నా

దక్షిణాదితోపాటు అటు హిందీలోనూ అప్పుడప్పుడూ అవకాశాల్ని అందుకుంటున్న రాశీఖన్నాకి అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించే అవకాశం సొంతమైనట్టు సమాచారం. తెలుగులో విజయవంతమైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని హిందీలో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా రీమేక్ చేస్తున్నారు. ఇందులో భార్య పాత్రలో విద్యాబాలన్ నటిస్తుండగా, ప్రియురాలి పాత్రలో రాశీఖన్నా నటించనున్నట్టు సమాచారం. తెలుగులో మీనాక్షి చౌదరి చేసిన పాత్ర రాశి సొంతమైందన్నమాట. మొదట మీనాక్షి పేరునే పరిశీలించిన చిత్రబృందం, ఆ తర్వాత ఆ పాత్ర కోసం రాశిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

# బోర్డర్-2 విడుదలకు గల్ఫ్ దేశాలు నిరాకరణ?

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2' జనవరి 23న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర్'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్– పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర్' 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

## ముదిరాజ్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో గురువారం నాడు తెలంగాణా ముదిరాజ్ మహాసభ నారాయణపేట జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా నియామకం అయినా పటేల్ శ్రీనివాస్ ముదిరాజ్ ను నారాయణపేట జిల్లా కమిటీ కాంగ్రెస్ నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెలుగుంది ఈరన్న మరికల్ పట్టణ అధ్యక్షులు హరీష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పి. రామకృష్ణ,గోవర్ధన్, పెంట మీద రఘు, ట్రైసన్ రాఘవేంద్ర, రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సి.ఎం.కప్ పోటీలు ప్రారంభం.



**నేటి సాక్షి రాయికల్(ఇమ్మడి విజయ్ కుమార్) :** అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సి. ఎం. కప్ గ్రామ పంచాయతీ పోటీలను గురువారం సర్పంచ్ ఎంబరీ గౌతమి వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి ఒలింపిక్ స్థాయి వరకు క్రీడల్లో ప్రతి ఒక్కరు ఎదగాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కప్ క్రీడలను ప్రారంభించారని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ప్రతి ఒక్కరు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినయ్, ప్రధానోపాధ్యాయులు కిరణ్,గ్రామ కార్యదర్శి శేఖర్, గ్రామ పెద్దలు వెంకటేష్, పి. డి. కృష్ణప్రసాద్,సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## పట్టించుకోని అధికారులు...

**నారాయణపేట జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వడ్డె శ్రీరామ్...**





**నేటి సాక్షి, నారాయణపేట(రిపోర్టర్ ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని ఎలిగేండ్ల గ్రామంలో భారీ గా ఉన్న చెట్లను నరికి వేస్తున్నారని నారాయణపేట జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వడ్డే శ్రీరామ్ తెలిపారు. గురువారం ఆయన మరికెల్లో విలేకరులతో మాట్లాడుతూ మరికల్ మండలంలోని ఎలిగండ్ల గ్రామ శివారులో గల చెట్లను నరికి వేస్తున్నారని ఇట్టి విషయంపై గతంలో అధికారుల దృష్టి తీసుకోని వెళ్లడం జరిగిందని ఆయన వివరించారు.ఇట్టి విషయంపై నరుకుతున్న చెట్లను ఆపాలని ఆయన అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

## మద్యం మాఫియా..!

**గ్రామాలనే లక్ష్యంగా**

**వైన్ షాప్‌ల నుంచి నేరుగా బెల్టు షాపులకు సరఫరా..!**

**ఎక్సైజ్ అధికారుల మౌనమే అక్రమాలకు అండా..?**




**నేటి సాక్షి మహబూబాబాద్(భూక్యా రవి నాయక్):** మరిపెడ మండలంలో అక్రమ మద్యం వ్యాపారం రోజు రోజుకు హద్దులు దాటుతోంది. వైన్ షాప్ నిర్వాహకులు చట్టాన్ని లెక్కచేయకుండా నేరుగా గ్రామాల్లోకి తిరుగుతూ బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారని మండల ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారులు కాకుండా లోపలి గ్రామ మార్గాలను ఉపయోగిస్తూ, రాత్రివేళల్లోనూ పగటిపూట కూడా నిర్భయంగా మద్యం తరలింపు కొనసాగుతోంది. ఈ వ్యవహారం ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియకుండానే జరుగుతోందా..? లేక తెలిసే కళ్లుమూసుకుంటున్నారా..? అనే అనుమానాలు బలపడుతున్నాయి. గుడుంబా తయారీ కేంద్రాలపై మాత్రం మెరుపు దాడులు చేస్తూ వార్తల్లో నిలిచే ఎక్సైజ్ శాఖ, అధికారిక మద్యం అక్రమంగా గ్రామాలకు చేరుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో యువత మద్యానికి బానిసలవుతూ కుటుంబాలు ఛిద్రమవుతున్నా, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికార యంత్రాంగంలో ఎలాంటి స్పందన కనిపించడం లేదు. వైన్ షాప్ నిర్వాహకుల అత్యుత్సాహమే ఈ అక్రమాలకు కారణమా..? లేక అధికారుల నిర్లక్ష్యమే మద్యం మాఫియాకు రక్షణగా మారిందా..? అన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలకు నేరుగా జరుగుతున్న మద్యం అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై తక్షణమే కేసులు నమోదు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షురాలిగా వెంకట లక్ష్మమ్మ

- మండల ఉపాధ్యక్షులుగా నారాయణ నాయక్....
- సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం....



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ ఎమ్మార్వో కార్యాలయం దగ్గర గురువారం మండల నూతనంగా డీలర్ మండల అధ్యక్షులుగా వెంకట లక్ష్మమ్మ ఉపాధ్యక్షుడిగా నారాయణ నాయక్ ప్రధాన కార్యదర్శిగా బాలప్ప మరియు యాదయ్య సభ్యులుగా సకీరప్ప రాజు నాయక్ డీలర్ బాబా అమృత పాత పల్లి గోపాల్ తదితరులు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షులు ఉపాధ్యక్షులకు గణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ధన్వాడ మండల తాసిల్దార్ సింధుజకు శాలువాలతో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా తమ డిమాండ్ల వినతి పత్రాన్ని ధన్వాడ మండల తాసిల్దార్ సింధుజను డీలర్ల ఆధ్వర్యంలో అందజేయడం. మండల తాసిల్దార్ సింధుజ మాట్లాడుతూ ఇట్టి విషయంపై నారాయణపేట జిల్లా కలెక్టర్ విన్నవిస్తామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు ధన్వాడ బాబా డీలర్, శివారెడ్డి, చక్కెరప్ప, యాదయ్య, పెదరాయుడు, సుధాకర్ శెట్టి, రాజు నాయక్, బాలయ్య,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# యువకుల ప్రాణ త్యాగాల ఫలితమే రామ మందిరం

- అభారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసిఎస్ రాజు
- జగిత్యాలలో ఘనంగా బాల రాముడి రెండవ వార్షికోత్సవ వేడుకలు



**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు):** సుమారు అయిదు వందల ఏళ్ల తర్వాత అనేక మంది యువకుల ప్రాణ త్యాగాల ఫలితంగా అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగి, బాల రాముడిని ప్రతిష్టించుకున్నామని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అరవ చంద్ర శేఖర రాజు (ఏసిఎస్ రాజు) అన్నారు.అయోధ్య ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించిన భారత్ సురక్ష సమితి రెండేళ్లక్రితం జనవరి 22న అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా నిర్వహించడం జరిగిందని, రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జగిత్యాల విద్యానగర్ ఎడ్ల అంగడిలో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు,మాజీ కౌన్సిలర్ అరవ లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసిఎస్ రాజు, సామాజిక సమరసత వేదిక అధ్యక్షులు చిట్ల గంగాధర్, భారత్ సురక్ష సమితి ప్రధాన కార్యదర్శి, న్యాయవాది అక్కినపల్లి కాశీనాథశీ లు మాట్లాడుతూ బీజేపీ సీనియర్ నాయకులు, భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి ప్రధానంగా లాల్ కృష్ణ అద్వానీ శ్రీరామ జన్మభూమి రథయాత్ర, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ సంకల్పంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది హిందువుల కల సాకారం అయ్యిందని కొనియాడారు. విదేశీయుల దాడుల వల్ల దేశంలో వేలాది దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయని, ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయని దేవాలయాల రక్షణకు, ధర్మరక్షణకు హిందువులు సంఘటితం కావాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరొకసారి అవకాశం కల్పించి రామరాజ్య స్థాపనకు అవకాశం కూడా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు జాబితాపూర్ వెంకట్రావు, నర్సింగారావు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, కొండపల్లి నర్సింగరావు, చిరంజీవి ఆనందరావు, పైడిపల్లి రాఘవరావు, ఎన్ వెంకటేశ్వరరావు, బా.సు.స కార్యదర్శి సింగం గంగాధర్, ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, సమరసత వేదిక పట్టణ అధ్యక్షుడు బొందుకూరు శ్రీనివాస్, విహెచ్పి కోశాధికారి మామిడాల రాములు, న్యాయవాది అనుమల భుజంగం, ఎడమల వెంకట్ రెడ్డి, కొత్తకొండ బాలన్న, ఆర్ఎస్ఎస్ వీరన్న, మాడంపల్లి గంగాధర్, కొక్కుల ఆంజనేయులు, నరేందర్ రాజు, గొల్లపెల్లి సత్యనారాయణ గౌడ్,రంజిత్ అయ్యగారి బృందం తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమాసన్‌పల్లిలో 'అరైవ్ అలైవ్' హెల్మెట్ల పంపిణీ





- సర్పంచ్ పన్నెల ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో 100 హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం

**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ రష్మీ పెరుమాళ్., ఐపీఎస్ మాట్లాడుతు సిద్దిపేట జిల్లా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తాను సందర్శించిన మొదటి గ్రామం ఇదేనని, అందుకే పెద్దమాసన్ పల్లి గ్రామస్తులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జిల్లాలోనే ఒక 'ఆదర్శ గ్రామంగా' నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం పోలీసుల కోసం కాదని, మీ కుటుంబ భద్రత కోసమని సూచించారు. గ్రామస్తులతో నేరుగా ముచ్చటించి, రహదారి భద్రతపై వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సామాజిక బాధ్యతగా 100 హెల్మెట్లను విరాళంగా ఇచ్చిన సర్పంచ్ పన్యాల ప్రవీణ్ కుమార్ రెడ్డిని ఈ సందర్భంగా కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. హెల్మెట్ల పంపిణీ అనంతరం, హెల్మెట్లు ధరించిన వాహనదారులతో నిర్వహించిన బైక్ ర్యాలీని కమిషనర్ జెండాఊపి ప్రారంభించారు. "హెల్మెట్ ధరించండి-సురక్షితంగా ఇంటికి చేరండి" అనే నినాదంతో ఈ ర్యాలీ సాగింది.కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, తొగుట సీఐ లతీఫ్, ఎస్సై రవికాంత్, గ్రామ ఉప సర్పంచ్ బోయిని శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు




**రంగారెడ్డి నేటి సాక్షి (సుధాకర్ గౌడ్) శంకర్‌పల్లి:** మోకిల పోలీసువారి ఆధ్వర్యంలో జనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం రోడ్డు భద్రతపై( ఆ రైవ్ ఆ లైవ్) భాగంగా రోడ్డు భద్రత పై అవగాన సదస్సులు, ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్ విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మోకిల ఇన్స్పెక్టర్ వీరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని,హెల్మెంట్ ,సీటు ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రాంగ్ రూట్ ,త్రిబుల్ రైడింగ్ చేయరాదని అన్నారు అలాగే వాహనం నడిపేటప్పుడు డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని తెలిపారు.ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే 100-ఖుఅశ్రీ కి కాల్ చేసి సమాచారం ఇస్తే తక్షణమే తాము స్పందిస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువు కొని వృద్ధులోకి రావాలని ఆకాంక్షించారు, పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఙ× సమరం రెడ్డి, ఎస్ఐలు ధర్మ, రాథోడ్, పద్మ, మండల విద్యాధికారి అక్బర్ ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే



**నేటి సాక్షి రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు 'రామాజీపేట దుబాయ్ వారథి సంఘం' సభ్యులు విద్యార్థుల క్రీడల కొరకు గురువారంరోజు 5 వేల రూపాయల ఆర్థిక చేయూతని పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగాదుబాయ్ వారథి సంఘం సభ్యుడు వట్టిమల్ల శ్రీనివాస్(దుబాయ్ శ్రీను) మాట్లాడుతూ చిన్న వయసు నుండే విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆటలు ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్తాయని,ఆటలు విద్యార్థులలో పోటీ తత్వంతో పాటు క్రీడా స్ఫూర్తిని కలిగిస్తాయని,మంచి క్రీడాకారులుగా తయారవుతారని తెలిపారు.దుబాయ్ వారధి సంఘంతో పాటు మనగ్రామంలో మన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మన వంతు చేయూతను అందించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జంకి మోహన్,మాజీ సర్పంచ్ వాసరి రవి, సూర విజయ్ మరియు దుబాయి వారథి సంఘం సభ్యులు వట్టిమల్ల శ్రీనివాస్ (దుబాయ్ శ్రీను),బట్టునరసయ్య, బేతి వంశీ రెడ్డి , గ్రామ నాయకులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నూతన క్యాలండర్ ఆవిష్కరించిన ఎస్పీ అశోక్ కుమార్

**నేటి సాక్షి జగిత్యాల ( ఇమ్మడి విజయ్ కుమార్ ):** జగిత్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో గాండీవం దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలండర్ ను ఎస్పీ అశోక్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వార్తాపత్రికలు సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషించాయని, ఒక్క పత్రిక పదివేల సైన్యంతో సమానం అని పెద్దలు భావించేవారని ఎస్పీ అన్నారు. ప్రజలలో సామాజిక చైతన్యం, విజ్ఞానం పెంపొందించడంలో గాండీవం దినపత్రిక ముందుంటుందని అన్నారు. ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలోను సామాజిక బాధ్యతను గుర్తు చేయడంలో, నేటికీ పత్రికలు సమాజ నిర్మాణంలో ఒక మూలస్తంభంగా నిలుస్తున్నాయనీ, ప్రభుత్వ విధానాలను ప్రజలకు, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో దినపత్రిక ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాండీవం దినపత్రిక జగిత్యాల జిల్లా ప్రతినిధి నక్క సతీష్, జగిత్యాల రిపోర్టర్, బాపురపు వెంకటేష్,కోరుట్ల నియోజకవర్గం ఆర్సి రాజేందర్, దుమల గంగాధర్, సిర్ర లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



# చిట్యాల మున్సిపల్ ఎన్నికల బరిలో బీఎస్పీ

- **జోనల్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్**

**నేటిసాక్షి, నల్లగొండ :** జిల్లా పరిధిలోని నకిరేకల్ నియోజకవర్గంలో ఉన్న చిట్యాల మండలంలోని 12 చిట్యాల మున్సిపల్ వార్డులలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధికారికంగా పోటీలో ఉంటుందని జోనల్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్, నియోజకవర్గ ఈసీ మెంబర్ గ్యార శేఖర్ అన్నారు. బుధవారం చిట్యా నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిట్యాల మున్సిపల్ వార్డులలో ఎవరి జనాభా దామాషా ప్రకారం, వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే స్పష్టమైన విధానంతో, ఆయా వర్గాలకు తగిన విధంగా టికెట్లు ఇచ్చే ఏకైక పార్టీ బీఎస్పీ మాత్రమేనని,"ఇది అధికారానికి కోసం చేసే పోటీ కాదు, ఇది బహుజనుల హక్కుల కోసం, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం చేసే పోరాటం అని, ప్రజల సమస్యలను వినే పార్టీ కాదు, పరిష్కరించే పార్టీ



బీఎస్పీ అని, ప్రజల మద్దతుతో ప్రజల పాలన సాధించడమే మా లక్ష్యం" అని, ప్రజలు బీఎస్పీ పార్టీ ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు శ్రీహరి, కృష్ణ, తరుణ్, సాంబ శివ తదితరులు పాల్గొన్నారు.

# 190 జివోని వెంటనే అమలు చేయాలి



- **జీవో 25తో లింక్ చేయకుండా 317 జీవో బాధితు ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగేలా జీవో 190ని పూర్తిగా అమలు చేయాలని సియస్ రామకృష్ణరావు ను కోరిన తపస్**

**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగేలా ఇచ్చిన జీవో 190 ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని తపస్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి వొద్నాల రాజశేఖర్, తెల్కలపల్లి పెంటయ్య,ఆర్గనైజింగ్ సెక్రటరీ హన్మంత్ రావులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ని కల్సి ప్రాతిపదాన సమర్పించారు. జీవో 25 తో ముడిపెట్టకుండా ఆ జీవో ను ప్రత్యేకంగా అమలు చేయాలి. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు తాత్కాలిక ఉపశమనం కోసం ప్రభుత్వం చేసిన 190 జీవో ను వెంటనే అమలు పరచాలని కోరారు.స్థానికతను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం సానుకూల నిర్ణయం త్వరగా తీసుకోవాలని కోరారు.

# పిల్లల సంతోషమే సరస్వతీకి ఇష్టం

- **దుర్గ భాయ్ దేశముఖ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు దాసరి రజని**

**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు)** పిల్లల సంతోషంగా ఉండడమే సరస్వతికి చాలా ఇష్టమని, అందుకే చదువుల తల్లి వద్ద పిల్లలు మొదటగా అక్షరాభ్యాసం చేస్తారని దుర్గభాయ్ దేశముఖ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు దాసరి రజని అన్నారు.జగిత్యాలకు చెందిన ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు దాసరి రజని వసంత పంచమిని పురస్కరించుకొని చిన్న పిల్లలకు నోట్ బుక్కులు, పెన్నులు, డ్రాయింగ్ బుక్కులు, కలర్ పెన్సిల్లు అందజేశారు.



**ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ**

వసంత పంచమి పర్వదినంను చిన్నారులు పవిత్రంగా భావిస్తారాని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా పేదల కోసం పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేశానని తెలిపారు. చిన్నారుల కళ్ళల్లో సంతోషాన్ని చూడడమే తన లక్ష్యమని రజని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న రజనీని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షురాలు ఎక్కల్దేవి శోభా, సలహాధారులు టీవీ అశోక్ కుమార్, బివి సుబ్బలక్ష్మి, కో ఆర్డినేటర్ నరేష్ యాదవ్, కో -కన్వీనర్ ఎన్నం కిషన్ రెడ్డి, కార్యదర్శి ఎక్కల్ దేవి లహరీ, లక్ష్మి హరిశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**తహశీల్దార్ శ్రీనివాస్**




**నేటిసాక్షి, మిర్యాలగూడ :** విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని మిర్యాలగూడ మాండల తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని శాస్త్ర హై స్కూల్ లో స్పోర్ట్స్ హబ్ కార్యక్రమాన్ని చైర్మన్ మైనం చంద్రశేఖర్, కరస్పాండెంట్ పాశం శ్రీధర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మిర్యాలగూడ మండల తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదవుతో పాటు అన్ని రంగాలలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మంచి ఉన్నత పదవులను పొంది, దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్ర హై స్కూల్ ప్రిన్సిపాల్ సింధు రెడ్డి, టీచర్స్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు వాహనాలు నడిపితే

**చట్టపరంగా చర్యలు తప్పవు..**



**నేటి సాక్షి.. చిలుకూరు :** చిలుకూరు మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ రాజ మహమ్మద్ హెచ్చరించారు గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు రోడ్డు దాటేటప్పుడు విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చూపించారు అనంతరం భద్రత వారోత్సవాలు ప్రతిష్టను విద్యార్థులతో చేయించారు ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

# ఉపాధి హామీ పనులు ప్రారంభం.



**నేటి సాక్షి.. చిలుకూరు :** చిలుకూరు మండలం ఉపాధి పనులు ప్రారంభించిన సర్పంచ్. మాలోతు విజయలక్ష్మి చంద్రు. కోమండ తండా గ్రామంలో ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పనులు గ్రామాలు అందరికీ కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో. సీనియర్ మేట్ భారత్ ప్రసాద్ మరియు వార్డ్ మెంబర్లు. కూలీలు పాల్గొన్నారు....

# వేసవిలో నువ్వు పంట సాగు



**నేటి సాక్షిరాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్):** వేసవిలో నువ్వు పంట సాగుచెయాలని సీనియర్ శాస్త్రవేత్త అన్నారు. గురువారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ల్, జి,ఎం, ఆర్,ఎఫ్,పీ,సీ వారి ఆధ్వర్యంలో వేసవి నువ్వు పంట సాగు పై రైతు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు గతంలో సాగుచేసిన నువ్వు పంటలకు ఎదురైన సమస్యల గురించి వివరించారు.అనంతరం సీనియర్ శాస్త్రవేత్త సంధ్య కిషోర్, తెగుళ్ళ విభాగం శాస్త్రవేత్త సుమలత, కీటక విభాగం శాస్త్రవేత్త స్వాతి లు రైతులకు నువ్వు పంటలు ఎలా వెయ్యాలో, కాండం, ఆకుల మీద వచ్చే తెగుళ్ల గురించి, మరియు క్రిమి కీటకాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచ్ మరిపెల్లి నారాయణ గౌడ్, సామల లావణ్య వేణు, మాజీ సింగిల్ విండో చైర్మన్లు సుర కంటి రాజారెడ్డి, కాటిపెల్లి నారాయణరెడ్డి, ఎఫ్,పీ,సీ చైర్మన్ గడ్డం రాజేందర్ రెడ్డి, రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు సౌండ్ సిస్టం



**నేటి సాక్షి రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్ ) :** అయోధ్య ప్రభుత్వ పాఠశాలలో గ్రామ సర్పంచ్ సిరిపురం లక్ష్మీ గంగాధర్ విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా రూ. 20 వేలు విలువ గల సౌండ్ బాక్స్ బ్లూటూత్ స్పీకర్ ను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో గ్రామ నాయకులు కొమురవెల్లి చిరంజీవి,ఎడమల జగదీశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన సిఐగా బాధ్యతలు



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా :** చెన్నూరు పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సిఐగా బన్సిలాల్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా సిఐ బన్సిలాల్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది వారికీ పూర్తి సహకారం అందించాలన్నారు

## యువత రక్తదానం వైపు అడుగు

**రక్తదానం మహా ప్రాణదానం అనే స్ఫూర్తి తో ముందుకు**

**రక్తదానం చేసిన అనిల్, సురేష్‌కి కృతజ్ఞతలు**

**చింత సుదీర్ మరియు పెషేంట్ కుటుంబ సభ్యులు**




**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు):** జగిత్యాల ప్రభుత్వ దవాఖాన లో చికిత్స పొందుతున్న ఇద్దరు పెషేంట్ లకి అత్యవసరంగా రక్తదాతలు కావాలని చింత సుదీర్ కి సమాచారం అందిన వెంటనే స్పందించి తమ తోటి డోనార్స్ అయినా అనిల్, సురేష్ లకి సమాచారం అందించిన వెంటనే రక్తనిది కి వెళ్లి తమ రక్తన్ని దానం చేసి మానవత్వం చాటుకున్నారు.

## 'ఆర్మీనా బెల్లం టీ' షాపు ప్రారంభం



**నేటి సాక్షి ఆసిఫాబాద్ :** వాంకిడి మండల కేంద్రంలో పఠాన్ గౌస్ ఖాన్ గారు ఏర్పాటు చేసిన 'ఆర్మీనా బెల్లం టీ' షాపును ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి గారు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు వ్యాపార రంగంలో యువత ముందుకు రావడం అభినందనీయమని పేర్కొంటూ, ఇలాంటి స్వయం ఉపాధి కార్యక్రమాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో BRS వాంకిడి మండల అధ్యక్షులు అజయ్ కుమార్, సర్పంచ్ చూనార్కర్ సతీష్, అహ్మద్, పొన్నాల నారాయణ, రాకేష్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## రగ్బీ పోటీలకు జ్యోతి విద్యార్థులు

**69 వ రాష్ట్ర స్థాయి SGF U -14**




**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీ కి చెందిన 8వ తరగతి విద్యార్థులు అల్లూరి వినీత మరియు కిష్ట రాంచరణ్ నవంబర్ 6 వ తేదీన కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియం లో జరిగిన జోనల్ స్థాయి రగ్బీ పోటీలలో ప్రతిభ కనబరిచి ఈ నెల జనవరి 23 నుండి 24 వరకు మహబూబాబాద్ జిల్లాలోని ZPHS గ్రౌండ్ డోర్నకల్ లో జరిగే 69 SGF రాష్ట్ర స్థాయి అండర్ 14 రగ్బీ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు గారు విద్యార్థులను అభినందించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పశువుల పండగ



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మండలంలోని పట్టణంతోపాటు పలు గ్రామాల్లో పశువుల పండుగను. ఘనంగా నిర్వహించారు, సాధారణంగా సంక్రాంతి వెళ్లిన తర్వాత వచ్చే గురువారం ఆయా ప్రాంతాల్లో సంక్రాంతిని తలపించే విధంగా పశువుల పండుగను నిర్వహిస్తారు ,ఈ క్రమంలో పశువులను సర్వాంగ సుందరంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు మహిళలు ఇళ్ళ ముందు రంగు రంగుల రంగవల్లులు వేసి అందరి దృష్టిని ఆకర్షించారు ,గ్రామదేవతలను సాంప్రదాయ బద్ధంగా పూజించారు

## పంచామృతాభిషేకం



**నేటి సాక్షిన్యూస్-చౌడేపల్లి:** పుదీపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో శారద నవరాత్రుల్లో నాలుగవ రోజున ఆలయ అర్చకురాలు శ్రావణి ఉదయమే అమ్మవారికి పంచామృత అభిషేకం చేసి అనంతరం. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు, చౌడేపల్లి పుంగనూరు చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శనం చేసుకుని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు, ఈరోజు ఉభయ దారులుగా పుంగనూరుకు చెందిన దామోదర్ గా వ్యవహరించారు, ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు

# శివుడి శాపంతో బ్రహ్మ దేవుడికి ఆలయాలు

- **శివపురాణ ప్రవచనంలో బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ అభిభాషణ**



**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు):** దేవతలందరికీ ఆలయాలు ఉన్నప్పటికీ, బ్రహ్మదేవుడికి మాత్రం శివుడి శాపం కారణంగా ఆలయాలు లేవని, పూజలు కూడా నోచుకోలేదని భాగవత సప్తాహ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్న శ్రీ శివ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం గురువారం మూడో రోజుకు చేరింది. అభినవ శుక, భాగవత భాస్కర బిరుదాంకితులు అయిన బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ భక్తులకు శివ పురాణ ఘట్టాలను హృదయాలకు హత్తుకునే విధంగా వివరించారు.

**శివుడి మహిమను వివరించిన భాస్కర శర్మ**

ఈ సందర్భంగా భాస్కర శర్మ మాట్లాడుతూ శివుడు భోళా శంకరుడని, ఆయన ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదని పురాణాల్లో పేర్కొనబడిందని తెలిపారు. శివుడు అభిషేకప్రియుడని, ఏ విధంగా పూజించినా భక్తులపై కరుణ చూపుతాడని వివరించారు. మాఘమాసం యజ్ఞ స్వరూపమని, అత్యంత మంగళకరమైన మాసమని చెప్పారు. మానవునిలో సత్వ గుణమే కాకుండా రజో, తమో గుణాలు కూడా ఉండాలని, వాటిని సద్వినియోగం చేస్తే సద్గుణాలు, చెడుకు ఉపయోగిస్తే దుర్గుణాలు అవుతాయని వివరించారు. నారదునిలో ప్రవేశించిన గర్వం, శక్తిపీఠాలు 18 కాక 54 అని, అలాగే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలపై విస్తృతంగా ఉపన్యాసం చేశారు.

**భక్తులకు అన్నప్రసాదం**

కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. అన్నప్రసాద దాతలుగా హైదరాబాద్‌కు చెందిన గుంట లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గుంటి జగదీశ్వర్, కార్యక్రమ నిర్వాహకులు నరేందుల అమర్, ఊటూరి భాస్కర్, ఊటూరి లక్ష్మీనరసింహారావు, ఊటూరి వేణుగోపాల్, కొత్తపెల్లి శ్రీనివాస్, ఊటూరి శ్రీనివాస్, ఊటూరి ప్రసాద్, ఊటూరి మహేష్, ఊటూరి నాగభూషణం, ఊటూరి హరీష్, ఊటూరి కళ్యాణి, జానకి, లక్ష్మి, విజయ, అపర్ణ, శ్రీదేవి, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తదితర భక్తులు పాల్గొన్నారు.

# రాయికల్ ను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే

- **ఆర్ ఎస్ అధ్యక్షురాలు దావ వసంత సురేష్**



**నేటి సాక్షి రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** గ్రామ పంచాయతీగా ఉన్న రాయికల్ ను మున్సిపల్ గా మార్చి 25 కోట్లతో ప్రతి వార్డులో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ దే అని బిఆర్ఎస్ అధ్యక్షురాలు జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చేర్ పర్సన్ దావ వసంత సురేష్ అని అన్నారు. రాయికల్ పట్టణంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయికల్ పట్టణంలో జరిగిన ప్రతి పని కేసీఆర్ ఉన్నపుడు జరిగిన అభివృద్ధి తప్ప ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా జరిగిన అభివృద్ధి ఏమి లేదు అని అన్నారు.రాయికల్ ను మున్సిపల్ గా చేసి మొదటిసారి రాయికల్ మున్సిపల్ లో గులాబీ జెండా ఎగరవేశామని, పార్టీ చేసిన అభివృద్ధితో మళ్ళీ రాయికల్ పట్టణంలో గులాబీ జెండా ఎగరేవేస్తామని అన్నారు. పట్టణంలో బిఆర్ఎస్ హయాంలో నిరు పేదలకు 60 డబల్ బెడ్ రూమ్ లు కేసీఆర్ మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అక్కడి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉందని అన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే రాయికల్ నుండి మైతాపూర్ బ్రిడ్జి మరియు ఇటిక్యాల్ బ్రిడ్జి ఎందుకు పూర్తి చేయలేకపోయారు అని ప్రశ్నించారు. కార్యకర్తల కష్టం మీద గెలిచిన నువ్వు సొంత అభివృద్ధి కోసం పార్టీ మారావు అని అన్నారు.పొలాలు నాటు వేసే సమయం కూడా అయిపోయిందని ఇంకా రైతు భరోసా కింద డబ్బులు ఎందుకు జమ కాలేదని అని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండా ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇస్తానన్నారు ఎప్పుడు ఇస్తారు..2000 నుంచి 4000 చేస్తా అన్న పెన్షన్లు ఎప్పుడు పెంచుతారని ప్రశ్నించారు. మిషన్ భగీరథ కింద చెరువుల పూడిక తీసి చెరువులో చాప పిల్లలు వేసి గంగపుత్రుల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత కేసిఆర్ అని అన్నారు. రాయికల్ పట్టణంలో అనువణువులో కేసీఆర్ చేసిన అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. రాయికల్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి తప్ప ఏ పార్టీకి కూడా ఓట్లు అడిగి అర్హత లేదని అన్నారు. ప్రభుత్వంతో కలిసి పని చేస్తా అన్న ఎమ్మెల్యే గాంధీ భవన్ కి ఎందుకు వెళ్లావు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేని మీకు గాంధీభవన్లో ఏం పని అన్నారు.ఎలక్షన్ టైం లో ప్రజల దృష్టి మళ్లించేందుకు బి ఆర్ ఎస్ నాయకులకు కక్షపూరితంగా నోటీసులు ఇచ్చి డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్ రెడ్డి చేస్తున్నాడని అన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారు తప్పకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ వాసం రాజేందర్, కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదయశ్రీ లింగన్న ,మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్, మాజీ కౌన్సిలర్ లు శ్రీరాములు సత్య నారాయణ,మహేష్ గౌడ్, మహేందర్ మాజీ కో ఆప్షన్ వనిత, గణేష్, సోహెల్ నాయకులు బాబా,ప్రశాంత్ రావు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- **అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్. లత**



**నేటి సాక్షి జగిత్యాల (ఇమ్మడి విజయ్ కుమార్ ):** జిల్లాలో నిర్వహించనున్న గణతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ లోన గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత మాట్లాడుతూలి గణతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. వేడుకలకు సంబంధించి జాతీయ పతాక ఆవిష్కరణ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్దం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. డయాస్ , సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. వైద్య బృందాలచే శిభిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలనుద్దేశించి చేసే ప్రగతి సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా అందజేయాలని అన్నారు. అవసరమైన మేర త్రాగు నీటిని ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం పాఠశాల విద్యార్థులను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ విద్యాశాఖ అధికారికి సూచించారు. వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేసే విధంగా డిఆర్డిఓ సమన్వయం చేసుకోవాలని తెలిపారు. గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు స్థానిక ఆర్డిఓ ఆర్డీవో,తహసిల్దార్ మరియు మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు ఈ సమావేశంలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధు సుధన్, కలెక్టరేట్ పరిపాలన అధికారి, ఆర్ డి ఓ రఘువరన్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులలో పాల్గొన్న భట్టి విక్రమార్క

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ నియోజకవర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా నిర్వహించిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, సాగునీటి సౌకర్యాలు, వ్యవసాయ రంగ సమస్యలతో పాటు ముఖ్యంగా గుండి, లక్మాపూర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ పనులకు త్వరితగతిన నిధులు మంజూరు చేసి, నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు జాబరి రవీందర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

